# ప్రజాభూమి

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




'థగ్ లైఫ్' పాట చిత్రీకరణలో త్రిష

...సినిమాలో


తెలంగాణ ఎడిటర్: విప్పల చంద్రశేఖర్ | బుధవారం 6-11-2024 | పేజీలు: 8 | వెల : అమూల్యం





2

## స్కూళ్లకూ రాజకీయ రంగును పులిమారు

బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

నాటి విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారు

నేడు రెసిడెన్షియల్ స్కూళ్లు ఎలుకలు విద్యార్థులను కరిచే స్థాయికి వచ్చాయి



2

## వాళ్లు టపాసులా పేలితే.. మేం రాకెట్‌లా దూసుకెళ్తాం

కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



8

6.2 మిలియన్ డాలర్ల్ సిరీస్-ఏ నిధుల సేకరణకు

## మారుత్ డ్రోన్స్ యత్నం

రాయల్ ఎన్‌ఫీల్డ్ విద్యుత్ బైక్‌ల విభాగంలోకి ఎంట్రీ ఇచ్చింది. తాజాగా ఫ్లయింగ్ ఫ్లీ సీ6 పేరిట విద్యుత్ బైక్‌ను ఆవిష్కరించింది.



6

రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి

## తొలి ఎలక్ట్రిక్ బైక్!

రాయల్ ఎన్‌ఫీల్డ్ విద్యుత్ బైక్‌ల విభాగంలోకి ఎంట్రీ ఇచ్చింది. తాజాగా ఫ్లయింగ్ ఫ్లీ సీ6 పేరిట విద్యుత్ బైక్‌ను ఆవిష్కరించింది.





# అంటరానితనం.. కులవివక్ష భారత్‌లోనే ఉంది

## దేశం ఎదగాలంటే కులవివక్ష ఉండకూడదు

- దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడమా
- తాను దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానని ఆరోపణలు
- రిజర్వేషన్ల పరిమితిని తీసేస్తాం
- కులగణన నిర్ణయం అభినందనీయం
- దేశంలో కులవివక్ష ఉ ందని మోదీ ఎందుకు ఛాలెంజ్ చేయట్లేదు
- ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఘాటైన వ్యాఖ్యలు

దేశం ఆర్థికంగా ఎదగాలంటే కులవివక్ష ఉండకూడదని, అయితే మన దేశంలో మాత్రం అంటరానితరం, కులవివక్ష పేరుకుపోయి ఉ ందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి గాంధీ తత్వ చింతన కేంద్రంలో కులగణనపై నిర్వహించిన సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు.



(ప్రజాభూమి ప్రతినిధి) హైదరాబాద్: దేశం ఆర్థికంగా ఎదగాలంటే కులవివక్ష ఉండకూడదని, అయితే మన దేశంలో మాత్రం అంటరానితరం, కులవివక్ష పేరుకుపోయి ఉందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి గాంధీ తత్వ చింతన కేంద్రంలో కులగణనపై నిర్వహించిన సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. కులవివక్ష, కులవ్యవస్థ ఉ న్నప్పుడు అసమానతలు ఎక్కువగా ఉంటాయని, అంటరానితనం భారత్‌లో తప్ప ఈ ప్రపంచంలో మరెక్కడా లేదని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దేశం ఆర్థికంగా ఎదగాలంటే కులవివక్ష ఉండకూడదని అభిప్రాయ పడ్డారు. కులగణనలో కొన్ని పొరపాట్లు జరగవచ్చని, వాటిని సరిదిద్దుతామని స్పష్టం చేశారు. కులవివక్ష ఉందని ఒప్పుకుందాం. (మిగతా 2వ పేజీలో)

# రాహుల్‌కు 6 గ్యారంటీలపై సమాధానం చెప్పే దమ్ముందా?

## కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్

- ఏం సాధించాని మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ యాడ్స్ ఇస్తోంది
- కేసీఆర్ ను మించిపోయిన కాంగ్రెస్ మాజీ సర్పంచుల పక్షాన బీఆర్ఎస్ ఆందోళన సిగ్గు చేటు
- చంపినోడే సంతాప సభ పెట్టినట్లుంది
- కాంగ్రెస్ అగ్రనేత అల్లుడి కోసమే మూసీ పునరుజ్జీవం
- వేములవాడ నియోజక వర్గం రుద్రంగిలోపలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



(ప్రజాభూమి ప్రతినిధి) హైదరాబాద్: రాష్ట్రానికి విచ్చేస్తున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి ఆరు గ్యారంటీలపై సమాధానం చెప్పే దమ్ముందా అని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. దేశమంతా పాద యాత్ర చేశానని చెప్పుకున్న రాహుల్ గాంధీకి ధైర్యముంటే 6 గ్యారంటీలపై తెలంగాణలో పాదయాత్ర చేయాలని సవాల్ విసిరారు. ఎన్నికల హామీలతో కర్నాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ, మహారాష్ట్రలోనూ దొంగ హామీలు, అబద్దాలతో ఓట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. తెలంగాణలో రుణమాఫీ చేసినట్లుగా, 6 గ్యారంటీల అమలు, ఇంకా ఎంతో అభివృద్ధి చేసినట్లుగా



గొప్పలు చెప్పుకుంటూ మహారాష్ట్రలో అన్ని పేపర్లకు యాడ్స్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. గతంలో కేసీఆర్ ఇట్లనే తెలంగాణ సొమ్మును మహారాష్ట్ర, పంజా బ్‌లకు పంచారని, కాంగ్రెస్ నేతలు ఆయనను మించిపోయారని మండిపడ్డారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజక వర్గంలోని రుద్రంగి మండల (మిగతా 2వ పేజీలో)

# ఛూమంతర్ అనగానే పెరగలేదు

## భూముల విలువపై బీఆర్ఎస్ వర్కింగ్ పెసిడెంట్ కేటీఆర్

తెలంగాణలో భూముల విలువ ఛూమంతర్ అనగానే పెరగలేదని, కేసీఆర్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా సమగ్ర, సమీకృత, సమ్మిళిత అభివృద్ధి చేశారని, అందుకే తెలంగాణలో ఎక్కడ ఏ మూలకు వెళ్లినా ఎకరం విలువ రూ. 15 నుంచి 20 లక్షలకు తక్కువ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మార్పు.. మార్పు అని కాంగ్రెస్ ప్రచారం చేసిందనీ.. మరి ఈ మార్పు ఎలా ఉంది? అని ప్రశ్నించారు. శ్రీనగర్ కాలనీలో తెలంగాణ రియల్టర్స్ ఫోరమ్ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

(ప్రజాభూమి ప్రతినిధి) హైదరాబాద్: భూమి కోసం తెలంగాణలో జరిగిన పోరాటాలు ఇక్కడి బిడ్డలందరికీ తెలుసని, ఎన్నో భూ ఉద్యమాలకు తెలంగాణ కేంద్రంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరి జీవితం భూమి చుట్టూ తిరుగుతోందని, భూమి విలువ చాలా ఎక్కువగా ఉంటుంది కనుకే దాని కోసం ఎన్నో పంచాయితీలు జరుగుతాయన్నారు. టీఆర్ఎస్ పార్టీకి మొదట్లో రంగారెడ్డి, మేడ్చల్ ప్రాంతంలో పట్టు దొరకలేదని, ఎందుకంటే తెలంగాణ ఏర్పడితే భూముల ధరలు తగ్గుతాయని చాలా ప్రచారం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే భూముల విలువ పెరుగుతదంటే (మిగతా 2వ పేజీలో)





4

బేగంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ, నాగ దేవత ఆలయంలో

# నాగులచవితి వేడుకలు

ఆలయ ఫౌండర్ చైర్మన్ జాండ్ల కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారిని

# విస్మరించింది మీరే

## బీఆరెస్ నేతలు ఈ పది ప్రశ్నలకు జవాబు చెప్పాలి

సామాజిక న్యాయం కోసం పోరాటం సాగిస్తున్నది ఒక్క కాంగ్రెస్ పార్టీనే

పదేళ్ల విధ్వంస పాలనలో ఎప్పుడైనా ఆత్మ విమర్శ చేసుకున్నారా?

మంత్రి శ్రీధర్ బాబు బహిరంగ లేఖ

2



ఆహారాన్నికల్తీ చేస్తే వదిలేది లేదు..

# కఠిన చర్యలుంటాయ్

ఫుడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

2

ప్రజాభూమి



## సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్నది ఒక్క కాంగ్రెస్ పార్టీనే

**పదేళ్ల విధ్వంస పాలనలో ఎప్పుడైనా ఆత్మ విమర్శ చేసుకున్నారా?**

### మంత్రి శ్రీధర్ బాబు బహిరంగ లేఖ

(ప్రజాభూమి ప్రతినిధి) హైదరాబాద్: దేశంలో సామాజిక న్యాయం, ప్రజల జీవన ప్రమాణాలు పర్చడానికి నిరంతరం పోరాటం సాగిస్తున్నది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉద్ఘాటించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షం స్థానానికి పరిమితమైనా పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసింది, మాట్లాడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పైన, తమ నేత రాహుల్ గాంధీ పైన బీఆరెస్ నేతలు చేసిన ఆరోపణలపై స్పందిస్తూ, మంగళవారం నాడు విడుదల చేసిన బహిరంగ లేఖలో కారు పార్టీ పెద్దలకు ఆయన పది ప్రశ్నలు సంధించారు.

1) మలిదశ తెలంగాణా ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన 1200 మంది విద్యార్థులు, యువకుల కుటుంబాలను బీఆరెస్ పెద్దలు ఎందుకు విస్మరించారో ఇప్పుడైనా జవాబు చెప్పగలరా?

2) 2014 జూన్ 14న ముఖ్యమంత్రి హెూదాలో అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన తీర్మానంలో 1200 బలిదానాలు జరిగినట్టు కేసీఆర్ స్వయంగా పేర్కొన్నారు. ఆ తర్వాత అనేక సార్లు మాట మార్చి అమరుల సంఖ్యను 585కు కుదిస్తూ వేర్వేరు ఉత్తర్వుల్లో వెల్లడించారు. మిగిలిన 615 మంది ఏమై పోయారో పదేళ్ల విధ్వంస పాలనలో ఎప్పుడైనా ఆత్మ విమర్శ చేసుకున్నారా?

3) ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు రూ.10 లక్షల నగదు, గృహ వసతి, సాగు భూమి, కుటుంబానికో ఉద్యోగం, ఉచిత విద్య, వైద్యం ఇప్పిస్తామని ఎన్నో హామీలిచ్చారు. చివరకు కొద్ది మందికి నగదు, ఉద్యోగాలు ఇచ్చినా మిగిలిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. బిడ్డలను, కుటుంబ పెద్దలను కోల్పోయిన ఆ కుటుంబాల గురించి కారు పార్టీ పెద్దలు ఎందుకు మాట్లాడటం లేదు?

4) అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతామన్న పెద్దలు అసలా మాటే అననే లేదని నాలుక మడత పెట్టింది వాస్తవం కాదా. దళిత కుటుంబాలకు ఇస్తామన్న 3 ఎకరాల భూమి నీటి మూట అయింది వాస్తవం కాదా?

5) తెలంగాణా తల్లిగా సోనియమ్మను పొగిడిన నోళ్లతోనే మీరు ఆ కుటుంబాన్ని కించ పరుస్తున్న విషయం ప్రజలకు తెలియదనుకుంటున్నారా? పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేస్తామన్నది ఎవరు? మాట తప్పింది ఎవరు? తెలంగాణాను ఇచ్చిన సోనియమ్మ, రాహుల్ గాంధీలు అకస్మాత్తుగా శత్రువులు ఎలా అయ్యారు ? రాజకీయంగా అదృశ్యమైపోతామన్న భయంతోనే కదా ఈ ప్రేలాపనలన్నీ.

6) అధికారం లోకి వచ్చిన వెంటనే నిరుద్యోగం అనేది ఉండదు అని ఆశలు కల్పించి కల్పించకుండా మోసగించింది మీరు కాదా?

7) గ్రూప్-1 పరీక్ష పేపర్ లీకయినా సమర్థించుకున్న చరిత్ర ఎవరిది? నోటిఫికేషన్ విడుదల చేసిన మూడేళ్లలో సరిగ్గా పరీక్షలు నిర్వహించలేని అసమర్థత ఎవరిది? న్యాయస్థానాల జోక్యంతో పరీక్షలు రద్దు చేయాల్సిన పరిస్థితికి మీరు బాధ్యులు కాదా ? నిరుద్యోగుల ఉసురు పోసుకుంది ఎవరో ప్రత్యేకంగా చెప్పాలా?

8) ఇళ్లు లేని పేదలందరికీ డబుల్ బెడ్రూం నివాసాలు నిర్మించి ఇస్తామని అరచేతిలో వైకుంఠం చూపించి పదేళ్లలో మీరు కట్టింది ఎన్ని? పంపిణీ చేసింది ఎన్నో గుండెపై చేయివేసుకుని చెప్పగలరా? కేజీ టు పీజీ విద్య హామీ అసలు మీకు గుర్తుందా?

9) కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఏడు జిల్లాల్లోని 16,40,000 ఎకరాలకు సాగునీరు అందుతుందని నమ్మబలికారు. మరి లక్ష ఎకరాలైనా సాగులోకి వచ్చిందా? మేడిగడ్డ నిర్మాణలోపాల గురించి, అంచనా వ్యయం రూ.40 వేల కోట్ల నుంచి రూ.లక్షా 40 వేల కోట్లకు పెంచడం పైన విచారణ జరుగుతోంది కాబట్టి వ్యాఖ్యానించదల్చుకోలేదు. కానీ ఈ వాస్తవాలన్నీ ప్రజలకు తెలియదని అనుకుంటున్నారా?

10) మేం నిత్యం ప్రజల్లోనే ఉంటున్నాం. మా అధినేత రాహుల్ గాంధీ దేశమంతా పర్యటిస్తున్నారు. రాష్ట్రానికీ వచ్చి వెళ్లారు. మరి జనం మధ్యకు వెళ్లంది మీరా, మేమా? అధికారం కోల్పోయాక ఇంటికే పరిమితమై బయటకు రానిది మీ పార్టీ అధినేత కాదా? రాహుల్ గాంధీని తక్కువ చేసి మాట్లాడితే పెద్దోళ్లమై పోతామని భ్రమ పడుతున్నట్టున్నారు. ఆయన జాతీయ నేత. ఉప ప్రాంతీయ పార్టీగా మారి ఉనికి కోల్పోతున్న రాజకీయ పక్షం నాయకులు మీరు. అంటూ మంత్రి శ్రీధర్‌బాబు లన బహిరంగ లేఖలో ప్రశ్నలు సంధించారు.

## స్కూళ్లకూ రాజకీయ రంగును పులిమారు

**బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం**

(ప్రజాభూమి ప్రతినిధి) హైదరాబాద్:

రాష్ట్రంలోని రెసిడెన్షియల్ స్కూళ్లకు కూడా సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ రంగు పులిమారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఏ రంగు పులిమినా ఫర్వాలేదని, చలికాలం వచ్చింది.. రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యార్థులకు రగ్గులు కూడా లేవట వాటి సంగతి చూడని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను బీఆర్ ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. కేసీఆర్ హయాంలో 1023 ప్రభుత్వ గురుకులాలు ఏర్పాటు అయ్యాయని హరీశ్‌రావు గుర్తు చేశారు. ప్రతి విద్యార్థిపై సంవత్సరానికి లక్షా 20 వేల రూపాయలు కేసీఆర్ వెచ్చించారన్నారు. కేసీఆర్ హయాంలో రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు అత్యున్నత సంస్థల్లో అడ్మిషన్లు పొందారని, డాక్టర్లు, ఇంజినీర్లు, పైలట్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారన్నారు.ఎవరెస్టుతో పాటు ప్రపంచ పేరు ప్రఖ్యాతులు ఉన్న పర్వత శిఖరాలను అధిరోహించారని గుర్తు చేశారు. కేసీఆర్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఎవరెస్టు స్థాయికి



పెంచితే.. రేవంత్ రెడ్డి రెసిడెన్షియల్ స్కూళ్లలో ఎలుకలు విద్యార్థులను కరిచే స్థాయికి తీసుకుపోయారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపనలు చేశారనీ, వాటిని కట్టేదాకా ఉన్న రెసిడెన్షియల్ స్కూళ్లను గాలికి వదిలేయడం మీ విధానమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడిగా ప్రభుత్వం భావించాల న్నారు. గురుకులాలను నడపడం గురుతర భాద్యతగా భావించాలే తప్ప గుడ్డెద్దు చేలో పడ్డట్టు వ్యవహరించొద్దని హితవు పలికారు. గురుకులాలను సమీక్షించేందుకు గతంలో సెంట్రల్ కమాండ్ సిస్టం ఉండేదని, ఇప్పుడు అలాంటి కమాండ్ సిస్టం లేదని, ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌కు ఓ హెల్త్ సూపర్ వైజర్ ఉండాలన్నారు. విద్యార్థు లు జబ్బు పడితే కనీస మందులు అందుబాటులో లేవని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు పాము లు, ఎలుకల కాట్ల బారిన పడుతున్నారని, వాటిని నియం త్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని విమర్శి ంచారు. విద్యార్థులు పడుకునేందుకు కనీసం మంచాలు కూడా లేవనీ, కింద పడుకోవడం వల్ల పాము కాట్ల బారి న పడుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి రెసిడెన్షియల్ స్కూళ్లపై సదభిప్రాయం లేదని, ఇటీవల చేసిన వ్యాఖ్యలను బట్టి తెలుస్తోందన్నారు.

ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లను మూసివేసే కుట్ర జరుగుతోందనే అనుమానం వ్యక్తం చేశారు. రాజకీయాల జోలికి పోకుండా ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, భేషజాలకు పోకుండా రెసిడెన్షియల్ స్కూళ్లకు ఉన్న పేరును పాడు చేయొద్దని హరీశ్‌రావు సూచించారు.

## రాహుల్‌కు 6 గ్యారంటీలపైసమాధానం చెప్పేదమ్ముందా

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రానికి విచ్చేసిన బండి సంజయ్, జిల్లా అధ్యక్షులు ప్రతాప రామక్రిష్ణ, రాష్ట్ర నాయకులు చెన్నమనేని వికాస్ రావులతో కలిసి రూ.22లక్షల విలువైన ఎంపీ లాడ్స్, ఉపాధి హామీ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. స్థానిక లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇయాళ ఏ ముఖం పెట్టుకుని తెలంగాణకు వస్తు న్నారన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారు. రాష్ట్రానికి వస్తున్న రాహుల్ గాంధీ ఈ విషయంపై మాట్లాడే దమ్ముందా అన్నారు. 6 గ్యారంటీలపై పాదయాత్ర చేసే దమ్ముందా, ప్రజలకిచ్చిన హామీలపై సమాధానం చెప్పిన తరువాతే రాహుల్ గాంధీ తెలంగాణకు రావాలని పేర్కొన్నారు



### రేవంత్ రెడ్డి మూసీ పాద యాత్ర చేయడం సిగ్గు

మూసీ ప్రక్షాలన పేరుతో సీఎం రేవంత్ రెడ్డి పాద యాత్ర చేస్తాననడం సిగ్గుగా ఉందని బండి అన్నారు.నా పాదయాత్రల మూసీ వద్దకు వెళ్లినప్పుడు విషం కక్కుతున్న నీళ్లను కళ్లారా చూసిన ఆవిషపు నీటి కోరల్లో చిక్కుకుని యాదాద్రి జిల్లా ప్రజలు ఏ విధంగా విలవిల్లాడుతున్నారో, సాగు నీరు సంగతి దేవుడెరుగు తాగు నీటి కోసం నీళ్లు కొనుక్కొని, వాటర్ ప్లాంట్ ద్వారా తెచ్చుకునేందుకు ఏ విధంగా బాధలు పడుతున్నరో చూసి బాదేసిందన్నారు. మూసీని ప్రక్షాళన చేయాలని బీజేపీ మొదటి నుండి కోరుతుండగా, ఆ పేరుతో పేదల ఇండ్లను కూల్చొద్దన్నదే మా డిమాండ్. అట్లాగే మూసీని అడ్డుపెట్టు కుని లక్షన్నర కోట్ల దోపిడీని ఆపాలన్నదే మా డిమాండ్ అన్నారు. 15వేల కోట్లతో ఖర్చు య్యే ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లకు పెంచి కమీషన్లు దండు కోవడానికి మేం వ్యతిరేకమన్నారు తెలంగాణ నిండా అప్పుల్లో మునిగిపోగా, బీఆర్ఎస్ చేసిన అప్పులను తీర్చేందుకు గంటకు 3 కోట్ల మిత్తి కట్టాల్సి వస్తోందని మీ మంత్రులే మొత్తుకుంటున్నరు. ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది జీతాలకే ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. అట్లాంటప్పుడు మళ్లీ లక్షన్నర కోట్ల అప్పు తెచ్చి జనంపై రుద్దడం ఎంత వరకు కరెక్టని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేత కుటుంబానికి కాంట్రాక్ట్ కట్టబెట్టడానికి తెలంగాణ ప్రజల జీవితాలను ఫణంగా పెడతారా అన్నారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కుటుంబం లక్ష కోట్లు దోచుకుంటే మీరు లక్షన్నర కోట్లు దోచిపెట్టడానికి మూసీని వాడుకుంటారా అంటూ ధ్వజమేతారు. మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పత్రికలకు ఫుల్ పేజీ యాడ్స్ ఇవ్వడంపై తెలంగాణలో 6 గ్యారంటీలను అమలు చేస్తున్నమని, రుణ మాఫీ చేసినమని ఊదరగొడుతూ మహారాష్ట్రలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీపేరుతో కోట్ల రూపాయల యాడ్స్ అక్కడి పత్రికలకు ఇవ్వడంపై మండిపడ్డారు. కేసీఆర్ ఇట్లనే మహారాష్ట్ర ఎన్నికల్లో ఖర్చు చేసిండని ఆరోపించారు.ఎంత దుర్మార్గమంటే 6 గ్యారంటీల అమలు కాలేదు. రుణమాఫీ పూర్తి కాలేదు. ఇంకా 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉందని వ్యవసాయ శాఖ మంత్రే ప్రకటించిండు. ఇలా ఉంటే మహారాష్ట్రలో మాత్రం రుణ మాఫీ చేసినం, 6 గ్యారంటీలను అమలు చేస్తున్నమని గొప్పలు చెబుతూ యాడ్స్ ఇస్తారా.మహారాష్ట్ర ప్రజల చెవిలో పూలు పెడదామను కుంటున్నారా అంటూ ఏద్దేవా చేశారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి కర్నాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసినట్లుగానే ఇప్పుడు మహా రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమవ్వడం సిగ్గుచేటుగా ఉందన్నారు. తెలంగాణ సమాజం కాంగ్రెస్ మోసాలను గ్రహించాలని కోరుతున్నానని, ఉచిత పథకాల అములుపై ప్రజలు రేవంత్ సర్కారును నిలదీయాలన్నారు.

## ఆహారాన్నికల్తీ చేస్తే వదిలేది లేదు..

**దామోదర రాజనర్సింహ**

(ప్రజాభూమి ప్రతినిధి) హైదరాబాద్:

హైదరాబాద్: ఆహారాన్ని కల్తీ చేసేందుకు ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో వదలబోమని.. కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ హెచ్చరించారు. నగరంలోని వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫుడ్ సేఫ్టీ విభాగం కమిషనర్ ఆర్వి కర్ణన్, ఐపీఎం డైరెక్టర్ శివలీల, జీహెచ్ఎంసీ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంత మంది స్ట్రీట్ ఫుడ్ వెండర్లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. వ్యాపారం చేసుకునే వారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు.

## అంటరానితనం..కులవివక్ష భారత్‌లోనే ఉంది

(మొదటి పేజీ తరువాయి)



దేశంలో కులవ్యవస్థ, కులవివక్ష ఉందని ఒప్పుకుందామని రాహుల్ గాంధీ అన్నారు. తాను దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానని ఆరోపణలు చేస్తున్నారని, దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజి ంచడమా అని ప్రశ్నించారు. కులగ ణన ద్వారా దళితులు, ఓబీసీలు, మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుంద న్నారు. కులగణన తర్వాత ఎవరి దగ్గర ఎంత ఆర్థిక వనరులున్నా యో తెలుసుకుందామన్న రాహుల్.. కులగణన చేస్తామని పార్లమెంట్‌లో స్పష్టంగా తాను చెప్పానని గుర్తు చేశారు.రిజర్వేషన్ల పరిమితిని తీసేస్తామన్న రాహుల్, తెలంగాణలో జరిగే కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కులగణనలో ఏ ప్రశ్నలు అడగాలనేది అధికా రులు నిర్ణయించకూడదు, సామాన్యులు నిర్ణయించాలన్నారు. కులగణన చేసి, జనాభా తగ్గట్లు రిజర్వేషన్లు పెంచుతామని తెలిపారు. తెలంగాణలో కులగణన నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ప్రభు త్వాలు తీసుకునే నిర్ణయాలకు ఇవి దోహద పడతాయని ఆయన వెల్లడించారు. దేశంలో కులవివక్ష ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు ఛాలెంజ్ చేయట్లేదని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కుల వివక్ష ఉందని తెలిసిన వాళ్లే అందరికీ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

ఈ సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు పాల్గొన్నారు. తత్వ చింతన కేంద్రంలో మేధావులు, బీసీ సంఘాలతో రాహుల్ ముఖాముఖి నిర్వహించారు. ముఖాముఖిలో కుల, విద్యార్థి సంఘాలు, మేధావులు పాల్గొన్నారు. రాహుల్‌గాంధీతో ముఖాముఖికి 400 మంది మేధావులను ఆహ్వానించారు. కులగణన ద్వారా జరిగే లాభాలను రాహుల్ గాంధీ వివరించారు. అనంతరం బోయిన్‌పల్లి నుంచి బేగంపేటకి రాహుల్‌గాంధీ బయలుదేరి అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ పయనమయ్యారు.

## ఛూమంతర్ అనగానే పెరగలేదు

(మొదటి పేజీ తరువాయి)



ఎవరు నమ్మలేదని, అసలు రాష్ట్రాన్ని నడిపే సమర్థత మీకు ఉందా అంటూ అనుమానాలు వ్యక్తం చేశార న్నారు. హిందూ ముస్లిం పంచాయితీ, నక్సలిజం, భూముల ధరలు పడిపోతాయంటూ ప్రచారాలు చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ తెలంగాణ ఏర్పడిన వెంటనే కేసీఆర్ పొట్టకూటి కోసం వచ్చిన వాళ్లతో మాకు పంచా యితీ లేదన్నారని, అభివృద్ధే మా మతం, సంక్షేమమే మా కులం అంటూ కేసీఆర్ స్పష్టంగా చెప్పారన్నారు. గతంలో బంగారం బ్యాంకుల్లో డిపాజిట్ చేసేవారనీ, కానీ గత 20 ఏళ్లుగా మాత్రం మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వాళ్లు భూమి మీద పెట్టుబడి పెట్టారన్నారు. అలాంటిది తెలంగాణ ఏర్పడితే తెలంగాణలో భూముల ధరలు ఢమాల్ అంటాయంటూ అనుమానంతో వాళ్లు ఉండేవారని, అందుకే తెలంగాణ ఏర్పాటుకు వాళ్లు భయపడ్డారని కేటీఆర్ తెలిపారు. అదే విధంగా తెలంగాణలో భూములకు గతంలో నీళ్లు ఉండే పరిస్థితి లేదనీ, మా తాతకు కూడా వందల ఎకరాలు ఉండేదికానీ, నీళ్లు లేకపోవటంతో దానికి ఎలాంటి విలువ లేకుండా పోయిందన్నారు. ఎంత పెద్ద భూస్వామి అయినప్పటికీ భూమికి విలువ లేకపోవటంతో బంగారం కుదవ పెట్టాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. కేసీఆర్ ఇవన్నీ దగ్గరుండి గమనించారనీ, నీళ్లు లేకపోవటంతోనే భూములకు విలువ లేదని గ్రహించారన్నారు.

## వాళ్లు టపాసులా పేలితే.. మేం రాకెట్‌లా దూసుకెళ్తాం



**కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

రాంచీ: జార్ఖండ్‌లో అధికారంలో ఉన్న జేఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వంపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అధినేత హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ఇండియా కూటమి టపాసులా పేలితే.. భాజపా శక్తిమంతమైన రాకెట్‌లా దూసుకెళ్తూ రాష్ట్రాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని అన్నారు. హతియాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. సోరెన్ ప్రతిపాదకుడు మండల్ ముర్ము భాజపాలో చేరిన విషయంపై మాట్లాడుతూ జేఎంఎం మునిగిపోతున్న నావ అని తెలుసు కాబట్టే అతడు తమ పార్టీలో చేరారని అన్నారు. ఇదంతా చూస్తుంటే రాష్ట్రంలో ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారో స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు.

# పెరిగిన రేట్లకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలి

- ఎంత ఇస్తారో క్లారిటీ లేకుండా గ్రామసభ నిర్వహిస్తే ఎలా అంటూ రైతుల ఆందోళన...
- రైతులు సహకరిస్తే యుద్ధ ప్రాతిపదికన కాలువల నిర్మాణం..
- గ్రామ సభలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్ ప్రకాష్



చిగురుమామిడి:గౌరవెల్లి ప్రాజెక్టులో కెనాల్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న బాధిత రైతులకు ప్రస్తుతం ఉన్న రేట్లకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని,పాత పద్ధతిలో నష్టపరిహారం ఇస్తే తాము తీవ్రంగా నష్టపోతామని బాధిత రైతులు మంగళవారం జరిగిన గ్రామ సభలో అధికారులను విజ్ఞప్తి చేశారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో కరీంనగర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్ ప్రకాష్ అధ్యక్షతన గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ భూ సేకరణ నోటిఫికేషన్ పై గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కెనాల్ లో భాగంగా భూమి కోల్పోతున్న రైతులకు ఎకరాకు ఎంత ఇస్తారో చెప్పకుండా గ్రామ సభ నిర్వహించి సంతకాలు పెట్టమంటే ఎలా పెడతామంటూ మొదటగా రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.అనంతరం అధికారులు మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం చేపట్టిన సర్వేకు అనుగుణంగా రైతులు సహకరించాలని,రైతులు సహకరిస్తే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కాలువల నిర్మాణం చేపట్టి రైతులకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు.నవాబుపేట గ్రామ పరిధిలో కాలువల నిర్మాణం కోసం 44ఎకరాల భూమిని సర్వే చేశామని అధికారులు పేర్కొన్నారు.ప్రథమ దశలో గ్రామసభ ఏర్పాటు చేసి ఎవరైతే రైతులు భూములు కోల్పోతున్నారో వారి పేర్లను చదువుతూ ఆయా సర్వే నెంబర్లలో ఎవరి భూమి ఎంత పోతుందో,పోయిన భూముల్లో రైతులకు సంబంధించిన బావులు, చెట్లు,షెడ్లతోపాటు పేర్లు తప్పుగా నమోదు అయిన వారివి సరిచేసి రాసుకున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ కిరణ్ ప్రకాష్ తెలిపారు.గ్రామ సభలో కేవలం రైతుల నుండి అభిప్రాయాలు,తప్పుగా నమోదైన వివరాలు మాత్రమే సేకరించి సరి చేశామని,మరోసారి పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని చెప్పారు.కెనాల్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ఏమైనా సందేహాలు, సమస్యలు ఉంటే రాతపూర్వకంగా రాసిస్తే పరిష్కరిస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ముద్దసాని రమేష్, స్పెషల్ డిటి నిఖిల రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రశాంత్,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# లోయర్ మానేర్ డ్యామ్‌లో మత్స్య కారుల వలల చోరీ

## పోలీసు స్టేషన్‌లో పిర్యాదు

(ప్రజాభూమి ప్రతినిధి) గన్నేరువరం: గన్నేరువరం సమీపంలో లోని లోయర్ మానేర్ డ్యామ లో దొంగలు పడ్డారు. మానేరు జలాలను నమ్ముకొని చేపలు పట్టే జాలర్ల వలలు మాయం అయ్యాయి. 5 క్వింటాళ్ల చేపలను పెట్టేందుకు డ్యాం లో ఒడ్డు ప్రక్కన వేసిన వలలు, సుమారు ఆరు లక్షల విలువ గల వలలు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని,గత నెల రోజుల్లో ఐదు ఈవిధంగానే చోరీ చేశారని మత్స్య కారులు పోలీసు స్టేషన్ లో మంగళవారం పిర్యాదు చేశారు.తక్షణం దొంగలను గుర్తించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.మండల పరిధిలోని గునుకుల కొండాపూర్ లో ట్రాక్టర్ ల బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలు దొంగతనం జరిగిన మరుసటి రోజే చేపల వలలు చోరీ కావడంతో పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చేపల వలల దొంగలను తక్షణమే పట్టుకోవాలని, ముదిరాజ్ సంఘం నాయకులు పోలీసులను కోరారు. సంఘటన స్థలాన్ని ఏఎస్సై లక్ష్మినారాయణ పరిశీలించారు



# బద్ది పోచమ్మ ఆలయంలో పోటెత్తిన భక్తులు

ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ

వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో అమ్మవారికి మంగళవారం భక్తులు బోనాలు నైవేద్యం సమర్పించి సేవలో తరించారు. 'చల్లగా చూడు తల్లి' అంటూ మొక్కులు తీర్చుకుంటున్నారు.అధిక సంఖ్యలో భక్తులు రావడంతో దర్శనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈవో వినోద్ రెడ్డి పర్యవేక్షించారు.



# పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించాలి

## పులి క్రిష్ణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

(ప్రజాభూమి బెజ్జంకి)

బెజ్జంకి మండలంలోని ముత్తన్నపేట గ్రామంలోని మణికంఠ కాటన్ ఆగ్రో ఇండస్ట్రీస్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో పత్తి కోనుగోలు కేంద్రాన్ని బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులిక్రిష్ణ ప్రారంభించారు.రైతులు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించాలని, తమ యొక్క నాణ్యమైన పత్తిని 8% నుండి 12% తేమశాతం మించకుండా తీసుకుని వచ్చి వారికి పత్తిని అమ్ముకుని సరైన మద్దత్తు ధరని పొందాలని,దళారులకు పత్తిని విక్రయించి మోసపోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి వెంకటయ్య,డైరెక్టర్లు నర్సయ్య,మౌనిక,నాయకులు రంగోని రాజు,ఎర్రల రాజు,గాజె శ్రీను,సత్యం,శంకర్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనారాయణ దేవస్థానంలో నేడు అన్నకూట్

ప్రాజాభూమి ప్రతినిధి, సికింద్రాబాద్ :

సికింద్రాబాద్ జనరల్ బజార్ లో గల అతి పురాతన దేవస్థానమైన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానంలో నేడు ( బుధవారం ) అన్నకూట్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసం శుద్ధ పంచమి నాడు దేవస్థానం వారు స్వామి వారికి ఈ అన్నకూట్ నిర్వహిస్తుంటారు. పోటు (వంటశాల)లో వండిన పులిహోర, లడ్డు, బూందీ, దద్ధోజనం, క్షీరాన్నం, కదంబం తదితర నైవేద్యాలను పూర్తిగా స్వామివారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి వాటిని భక్తులకు శాత్తుమురై గోష్టి ( సహ పంక్తి ) లో ప్రసాద వితరణ చేస్తారు. ఈ అన్నకు కార్యక్రమానికి సికింద్రాబాద్ నుండే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, గుమిడెల్లి రవీందర్, ఆలయ కార్యనిర్వహణాధికారి కొమ్మాలు లు అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు.



# వీధి కుక్కల భారి నుండి ప్రజలను రక్షించండి

ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ

వీధి కుక్కల బారి నుండి ప్రజలను రక్షించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. వేములవాడ పట్టణంలో మాట్లాడుతూ.. పట్టణంలో తరచూ కుక్కల దాడులు జరుగుతున్నాయని, ఇటీవల కుక్క ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలన్నారు.



# అతివేగంతో బైకును ఢీకొన్న కారు

ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ రూరల్

సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద అతివేగంతో వెళ్తున్న కారు.. బైకును ఢీకొట్టింది. ఈ ఘనటలో బైకుపై వెళ్తున్న వ్యక్తికి గాయాలు కాగా.. స్థానికులు స్పందించి ఆసుపత్రికి చేరుకున్నారు. క్షతగాత్రుడు చెక్కపల్లి గ్రామానికి చెందిన ఐలవేని శ్రీనివాస్ అని స్థానికులు తెలిపారు.

# కులగణన దేశంలోనే చారిత్రాత్మకం

## సర్వేను ప్రజలంతా విజయవంతం చేయాలి

## కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు

(ప్రజాభూమి ప్రతినిధి) కరీంనగర్ :



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి తెలంగాణ వ్యాప్తంగా కులగణన ప్రారంభం కానుందని, ఈ సర్వే దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు.

మంగళవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకులు ఈ సర్వేను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజల జీవితాల్లో మరింత వెలుగులు నింపేందుకే ఈ సర్వేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నదని తెలిపారు. సర్వేకు ప్రజలంతా సహకరించాలని, ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. సమాజంలోని సంపదను అన్ని వర్గాలకు సమానంగా పంచాలన్నదే రాహుల్ గాంధీ సిద్ధాంతమని, అందుకోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపడుతున్నదని చెప్పారు.

తెలంగాణలో నిర్వహిస్తున్న కుల గణన దేశంలోనే రోల్ మోడల్ గా నిలవబోతున్నదని తెలిపారు. పెండింగ్ లో ఉన్న దశాబ్దాల ప్రజల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తున్నదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సంవత్సరాలుగా జన గణన చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం కులగణన నిర్వహిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. తప్పకుండా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి దేశవ్యాప్తంగా కులగణన చేపట్టే పరిస్థితి వస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని పేర్కొన్నారు. సర్వే తో సమాజంలో ఉన్న అన్ని వర్గాలకు సమన్యాయం, సమాన హక్కులు లభిస్తాయని, ఏ ఒక్కరికీ నష్టం కలుగకుండా చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఊరూరా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఈ సర్వేలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సహాయ సహకారాలు అందించాలని వెలిచాల రాజేందర్ రావు కోరారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షుగర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ

లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆఫ్ వేములవాడ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్ నేతృత్వంలో డయాబేటిక్ క్యాంపు మంగళవారం ఉదయం నిర్వహించారు. 80 మందికి డయాబెటిక్ టెస్టు నిర్వహించి ముగ్గురికి షుగర్ నిర్ధారణ చేసినట్లు పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శ్రీనివాస్, కోశాధికారి వరాల వెంకటకృష్ణ, మాజీ అధ్యక్షులు సామ వీర రమణ, మారం కుమార్ పాల్గొన్నారు.

# బట్టలు ఉతకడం కోసమని నమ్మించి అత్యాచారం

ప్రజా భూమి ప్రతినిధి : బట్టలు ఉతకడం కోసమని మహిళను నమ్మించి తమ రూంకు తీసుకెళ్ళి ముగ్గురు వ్యక్తులు అత్యాచారం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొండాపూర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఐటెక్‌సిటీలోని ప్రైవేట్ సంస్థలో హౌస్ కీపింగ్‌గా విధులు నిర్వహిస్తుంది. సోమవారం సాయంత్ర విధులు ముగించుకుని తన ఇంటికి వెళ్ళడానికి హైటెక్ సిటీ బస్టాప్ సమీపంలో ఎదురు చూస్తుంది. ఇదే సమయంలో ముగ్గురు వ్యక్తులు ఆమె వద్దకు వచ్చి తమ దుస్తులు ఉతకడానికి రావాలని ఆమెను కోరారు. ముందుగా ఆమె నిరాకరించినప్పటికీ దుస్తులు ఉతికినందుకు ఎక్కువగానే డబ్బులు ఇస్తామని ఆశ చూపారు. సరేనని ఆమె వారి వెంట ఆటోలో బయలుదేరింది. ముగ్గురు వ్యక్తులు ఆమెను తాము నివసించే ఓంనగర్ ఏరియాలో ఉన్న ఇంటికి తీసుకెళ్ళారు. ఇంటికెళ్ళాక తాను ఉతకడానికి బట్టలు ఏవని ఆమె అడగ్గా తలుపులు మూసి ఆమె నోట్లో గుడ్డలు కుక్కి కట్టివేశారు. ఆమె తప్పించుకోడానికి ప్రయత్నించగా విపరీతంగా ఆమెను కొట్టారు. ఆనంతరం ముగ్గురు వ్యక్తులు ఆమెను బలవంతంగా అత్యాచారం చేశారు. ఎలాగోలా నోట్లో గుడ్డలు తీసేసుకున్న ఆమె కేకలు వేసింది. ఈ కేకలు విన్న పక్కింటి మహిళ తలుపులు కొట్టింది. ఆమె వెళ్ళి తలుపులు తీసి విషయాన్ని మహిళకు తెలియజేసింది. అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కాగా యుపీకి చెందిన రఫీక్, చోటూ, చందు అనే వ్యక్తులు ఇటీవల ఓంనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని పెయింటింగ్ వర్క్ చేస్తున్నారని, ఆ వ్యక్తులు అఘా యిత్యానికి పాల్పడినట్టు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ విలేకరులకు తెలి యజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

# మారుమూల గ్రామాల్లో సైతం వైద్యం

హైదరాబాద్, (ప్రజా భూమి ప్రతినిధి): నగరంలోనే కాకుండా మారుమూలకు గ్రామాల్లో సైతం విద్యా, వైద్యం వంటి అనేక సేవలను లయన్స్ క్లబ్ ద్వారా అందించటం అభినందించదగ్గ విషయమని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మంగళవారం బాలానగర్‌లోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న హాస్పిటల్ ఎక్స్‌టెన్షన్ బ్లాక్‌కు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు పేదలకు సేవ చేయాలనే తలంపుతో ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు ఉచితంగ విద్య అందించటం, అత్యవసర, వరదలు, విపత్తుల సమయాల్లో ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు చేయటం, వేసవి కాలంలో చలివేంద్రాలను ప్రారంభించి సేవ చేయటం గొప్ప విషయమన్నారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ సేవలు అవసరమైన ప్రతి సందర్భంలోనూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయని, బహుశా ఇలాంటి సంస్థ ప్రపంచంలో మరోకొటి లేదని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా ప్రజలు ఆపదలో ఉంటే తన ఆపన్న హస్తాన్ని ఇచ్చి లయన్స్ క్లబ్ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, పులి శివకుమార్ గౌడ్, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, సంజీవ, మధుగౌడ్, బాల నరసింహ, అనిల్. నరేందర్, భరత్ తదితరులుపాల్గొన్నారు.

# బలగాని ఆస్పత్రిలో శస్త్ర చికిత్స

### 15 ఏళ్లుగా వంగి ఉన్న వెన్నుపూసను సరిచేసిన వైద్యులు

హైదరాబాద్, (ప్రజా భూమి ప్రతినిధి) : గత 15 ఏళ్లుగా వెన్నుపూస సమస్యతో బాదపడుతున్న మహిళకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బలగాని స్పైన్ అండ్ ఆర్థో ఆస్పత్రి వైద్యులు విముక్తి కల్పించారు. వివరాల్లోకి వెళితే వరంగల్ జిల్లాకు చెందిన రేణుక(35) గత 15 ఏళ్లుగా వంగిన వెన్నుతో బాధపడుతుంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నయం కాకపోవడంతో చివరకు బలగాని ఆస్పత్రిని సంప్రదించగా చీఫ్ స్పైన్ సర్జన్ శ్రీనివాస్ బలగాని శస్త్రచికిత్సతో సమస్యను తొలగించవచ్చని బాధితురాలి కుటుంబికులకు వివరించారు. ఈ మేరకు డాక్టర్ శ్రీనివాస్ బలగాని ఆద్వర్యంలో 6 గంటల పాటు శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులు స్క్రూ, రాడ్లు వినియోగించి వంకర నడుమును సరిచేశారు. శస్త్ర చికిత్స అనంతరం రేణుక వంగి నడిచే ఇబ్బంది తొలగడంతో కుటుంబికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్పైన్ సర్జన్ శ్రీనివాస్ బలగాని మీడియాకు వరించారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

కరీంనగర్ , (ప్రజా భూమి ప్రతినిధి) : కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండల కేంద్రానికి సమీపంలో షా నగర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.రామడుగు మండల కేంద్రానికి చెందిన సామంతుల శివాజీ.నీలం అరుణ్ అనే ఇద్దరు యువకులు కరీంనగర్ నుండి సొంత ఊరి వైపు వస్తుండగా షానగర్ గ్రామ సమీపంలో బొలెరో వాహనం వీరి బైక్ ని ఢీ కొట్టింది.. అయితే రెండు వాహనాలు వేగంగా ఉండడంతో శివాజీ అనే యువకుడు స్పాట్లోనే మృతిచెందగా.కొద్ది సమయం తర్వాత నీలం అరుణ్ ప్రాణాలు విడిచాడు. ఊర్లో అందరితో కలివిడిగా ఉండే యువకుల మృతితో గ్రామస్తులు కన్నీరు మున్నీరు అయ్యారు.

# 46 ఏళ్ల నిరీక్షణ... " ప్రజావాణి " తో సాకారం...

## వంద రోజుల్లోనే అందిన పట్టాదారు పాసు పుస్తకం

### సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన లబ్ధిదారు కొమ్మనబోయిన పిచ్చయ్య



హైదరాబాద్, (ప్రజా భూమి ప్రతినిధి) : 46 ఏళ్ల నుంచి ఒక ఎకరం సాగుభూమి పట్టాదారు పుస్తకం కోసం ఎదురు చూస్తున్న కొమ్మనబోయిన పిచ్చయ్య నిరీక్షణ ముఖ్యమంత్రి "ప్రజావాణి"తో సాకారమైంది.మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన కొమ్మనబోయిన పిచ్చయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య లకు ధన్యవాదాలు తెలిపారు.

నల్లగొండ జిల్లా నక్రేకల్ అసెంబ్లీ నియోజకవర్గం కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన పిచ్చయ్య ఒక ఎకరం భూమి పట్టాదారు పాసుపుస్తకం కోసం ముఖ్యమంత్రి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న వంద రోజుల్లోనే భూమి పాస్ పుస్తకం చేతికి అందింది.

1978లో అందిన ఒక ఎకరం భూమి పట్టా సర్వే నెంబర్ 215/3 కి సంబదించి పట్టాదారు పాసు పుస్తకం కోసం పిచ్చయ్య రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన సీఎం ప్రజావాణి విషయం తెలుసుకున్న పిచ్చయ్య పట్టాదారు పాసు పుస్తకం కోసం గత జూలై నెలలో దరఖాస్తు చేసుకున్నారు. వంద రోజుల్లోనే భూమి పట్టాదారు పాసు పుస్తకం చేతికి అందింది అని పిచ్చయ్య ఆనందాన్ని వ్యక్తం చేశారు. తన ఇద్దరు కుమారులు నరసింహ, స్వామి యాదవ్ లతో కలిసి ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి చిన్నారెడ్డి, దివ్య చేతుల మీదుగా పిచ్చయ్య పట్టాదారు పాసు పుస్తకం తీసుకున్నారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ భరోసా కల్పిస్తోందని పిచ్చయ్య అన్నారు.

# తులం బంగారం మహిళలకు ఎప్పుడిస్తారు

### 70మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తలసాని



బేగంపేట్ (ప్రజా భూమి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన తులం బంగారం మహిళలకు ఎప్పుడు ఇస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో బేగంపేట, రాంగోపాల్ పేట, మోండా మార్కెట్, బన్సీలాల్ పేట డివిజన్ లకు చెందిన 70 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ 58, షాదీముబారక్ 12 చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచు పెండ్లికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలనే ఆలోచన తో బి ఆర్ ఎస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ అసెంబ్లీ ఎన్నికల ముందు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని ప్రకటించి ఏడాది కావస్తున్నా, ఇవ్వడం లేదని, ఎప్పుడు ఇస్తారనేది ప్రభుత్వం స్పష్టం చేయాలని లబ్ధిదారులు అడుగుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆర్ డి ఓ, తహశీల్దార్ లను ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ కోరారు. లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడంలో జాప్యం జరుగుతుందని, ఆలస్యం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్ డి ఓ సాయిరామ్, బేగంపేట, బన్సీలాల్ పేట కార్పొరేటర్ లు టి. మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, తహశీల్దార్ పాండు నాయక్, బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### బేగంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ, నాగ దేవత ఆలయంలో

# నాగులచవితి వేడుకలు

### ఆలయ ఫౌండర్ చైర్మన్ జాండ్ల కృష్ణ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు

(ప్రజాభూమి ప్రతినిధి) : బేగంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ, నాగ దేవత ఆలయంలో ఘనంగా నాగులచవితి వేడుకలు బేగంపేట శ్రీ రేణుక ఎల్లమ్మ నాగదేవత ఆలయంలో మంగళవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులు పుట్టలో పాలు పోసేందుకు, పూజలు నిర్వహించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ ఫౌండర్ చైర్మన్ జాండ్ల కృష్ణ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. కార్తీకశుద్ధ చతుర్థి దీపావళి వెళ్ళిన నాలుగో రోజు వస్తుంది. పుట్టిన బిడ్డలు బ్రతకక పోయినా, పిల్లలు కలుగకపోయినా, నాగ ప్రతిష్ట చేసి పూజించటం సాంప్రదాయంగా వస్తుంది. అలా నాగ మహిమతో పుటిన సంతానానికి, నాగలక్ష్మి, నాగేశ్వరరావు, నాగయ్య వగైరా పేర్లు పెట్టుకుంటారు. మన పురాణాలలో నాగుల చవితి గురుంచి ఎన్నో గాథలు ఉన్నాయి. దేశమంతట పలు దేవాలయల్లో మెలికలతో ఉన్న నాగేంద్రుని విగ్రహాలు కనిపిస్తూ ఉంటాయి. ఈ నాగుల చవితి నాడు నాగేంద్రుడు నీ శివభావముతో ఆరాదిస్తే సర్వరోగాలు పోయి సౌభాగ్యవంతులవుతారని నమ్మకం భక్తుల లో వుంది. ఈ రోజున ఉదయమే, తలస్నానము చేసి పుట్టదగ్గరికి వెళ్ళి, నాగరాజును పూజించి పాలు పోసి చలిమిడి, చిమ్మిలి, అరటిపళ్ళు, తాటి బుర్రగుంజు, తేగలు మున్నగున్నవి నివేదన చేస్తారు. ఆ పుట్ట మట్టిని పుట్టబంగారం అని, దానిని కొద్దిగా తీసుకొని చెవి దగ్గర పెట్టుకుంటారు. పెడితే చెవి బాధ తగ్గుతుందంటారు. ఆ సందర్భంగా పుట్ట వద్ద "దీపావళి" నాడు మిగిలిన మతాబులు, కాకరపువ్వొత్తులు, టపాసులు మొదలైనవి చిన్నపిల్లలు ఎంతో సంతోషంగా కూడా కాలుస్తారు.

# లండన్‌లో ప్రారంభమైన వరల్డ్ ట్రావెల్ మార్కెట్

లండన్, నవంబర్ 5 : యూకే లో ఇన్క్రెడిబుల్ ఇండియా స్టాల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత హై కమీషనర్ విక్రమ్ దురై స్వామి, కేంద్ర పర్యాటక శాఖ డీజీ ముగ్ధ సిన్హాతో కలిసి పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ టూరిజం స్టాల్ ని యూకే లో భారత హై కమీషనర్ విక్రమ్ దురై, కేంద్ర పర్యాటక శాఖ డీజీ ముగ్ధ సిన్హా సందర్శించారు. లండన్ టీ ఎక్స్చేంజ్ చైర్మన్ తో మంత్రి జూపల్లి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ పర్యాటక రంగంలో పెట్టుబడులు, హైదరాబాద్ లో టీ ఎక్స్చేంజ్ ఔట్లెట్, లండన్ ఐ తరహాలో ఐకానిక్ జాయింట్ వీల్ ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు.

**తెలంగాణ పర్యాటక శాఖ స్టాల్ ని ప్రారంభించిన మంత్రి**

లండన్ వేదికగా ప్రపంచ పర్యాటక ప్రదర్శనలో తెలంగాణ మెరిసింది. ఆవిర్భావిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం – పర్యాటక రంగానికి మేలు చేసే అవకాశాలు థీమ్ తో లండన్ వేదికగా ఎక్సెల్ హాల్స్‌లో జరుగుతున్న 44 వ వరల్డ్ ట్రావెల్ మార్ట్ (ప్రపంచ పర్యాటక ప్రదర్శన) లో పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ ని పర్యాటక సంస్థ అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలసి ప్రారంభించారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా తెలంగాణ పర్యాటక అందాలు, చారిత్రక ప్రదేశాల ఛాయచిత్రాలను డిజిటల్ స్క్రీన్ లో పర్యాటక శాఖ ప్రదర్శించింది. తెలంగాణ పర్యాటక స్టాల్ ను యూకే లో భారత హై కమీషనర్ విక్రమ్ దురై, కేంద్ర పర్యాటక శాఖ డీజీ ముగ్ధ సిన్హా, గోవా పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖంటే, ఒడిషా డిప్యూటీ సీఎం ప్రవతి ఫరీదా, రామోజీ ఫిల్మ్ సిటీ ఎండీ విజయేశ్వరి, తదితరులు సందర్శించారు. పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ఏవీ (%ూాఎ%)ని తిలకించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణామోహన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, డా.వంశీ కృష్ణ, డా. రాజేష్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు.




**తెలంగాణ టూరిజం ప్రమోషన్ లో భాగంగా లి**

వివిధ దేశాల ప్రతినిధులు, కేంద్ర, ఆయా రాష్ట్రాల పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో మంత్రి జూపల్లి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రతిష్టాత్మక లండన్ టీ ఎక్స్చేంజ్ చైర్మన్ ఆల్యార్ రెహమాన్ తో మంత్రి జూపల్లి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పర్యాటక శాఖ అభివృద్ధిలో భాగంగా విదేశీ పెట్టుబడులు, హైదరాబాద్ లో టీ ఎక్స్చేంజ్ ఔట్లెట్ ఏర్పాటు, లండన్ ఐ తరహాలో హైదరాబాద్ లో జాయింట్ వీల్ ఏర్పాటు చేయడం, తదితర అంశాల గురించి చర్చించారు. విదేశీ

**తెలంగాణ పర్యాటక శాఖ స్టాల్ ప్రారంభించిన మంత్రి జూపల్లి**



పర్యాటకులను ఆకర్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. తెలంగాణలో టూరిజం అభివృద్ధికి, పర్యాటకులకు మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో చేపడుతున్న కార్యక్రమాలను, తెలంగాణ పర్యాటక ప్రదేశాల గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ%ౌ% సీయం రేవంత్ రెడ్డి పర్యాటక రంగపై ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రపంచ పర్యాటక యవనికపై తెలంగాణ పర్యాటకం తనదైన ప్రత్యేకతను చాటుతోందని అన్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్లుతున్నట్లు తెలిపారు. తెలంగాణ పర్యాటకాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు వరల్డ్ ట్రావెల్ మార్కెట్ లో తెలంగాణ పర్యాటక రంగాన్ని సరికొత్తగా ప్రపంచానికి పరిచయం చేస్తామని తెలిపారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు దేశంలో వివిధ రాష్ట్రాల మధ్య సమన్వయం ఎంతో అవసరమని అన్నారు.

అనంతరం ఇన్క్రెడిబుల్ ఇండియా స్టాల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యూకే లో భారత హై కమీషనర్ విక్రమ్ దురై, కేంద్ర పర్యాటక శాఖ డీజీ ముగ్ధ సిన్హాతో కలిసి మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మెహన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. లండన్ లో ఇవాల్టి నుంచి మూడు రోజుల పాటు జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (%ఔవీ%) లో ప్రపంచ వ్యాప్తంగా 125 దేశాలు, భారత్ నుంచి 10 పైగా రాష్ట్రాలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి.

ప్రజాభూమి



# అత్యవసర వైద్య చికిత్స కోసం రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి అందజేత

హైదరాబాద్, ప్రజా భూమి ప్రతినిధి): శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన మహిళ అత్యవసర వైద్య చికిత్స కోసం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసిని బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని హైదర్ నగర్ డివిజన్ నిజాంపేటకు చెందిన నీలిమ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా, వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు నీలిమ వైద్య చికిత్సకు 5 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు కాగా.. మంగళవారం తెలంగాణ పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిలు బాధిత కుటుంబానికి ఎల్ఓసిని అందజేశారు. ఈ కార్యక్రమంలో నీలిమ కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అమెరికాలో ఎలక్షన్ డే.. తొలి ఫలితం వచ్చేసింది!




అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ తేదీ (నవంబర్ 5) మొదలైన కొన్ని గంటలకే అక్కడి ఓ చిన్న కౌంటీలో కౌంటింగ్ కూడా పూర్తయ్యింది. న్యూహ్యాంప్‌షైర్ రాష్ట్రంలోని డిక్స్‌విల్లే నాచ్‌లో తొలి ఫలితం వచ్చేసింది. అక్కడ మొత్తం ఆరుగురు ఓటర్లు ఉండగా.. డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌కు మూడు, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ నకు మూడు ఓట్లు వచ్చాయి. 2020లో మాత్రం డెమోక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ వైపు డిక్స్‌విల్లే నాచ్ ఓటర్లు మొగ్గుచూపారు. ఆ ఎన్నికల్లో ఆయనే విజయం సాధించడం విశేషం.డిక్స్‌విల్లే నాచ్ అమెరికా-కెనడా సరిహద్దులో ఉన్న ప్రదేశం. ఇక్కడ ప్రస్తుతం ఆరుగురు ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఎలక్షన్ డే మొదలైన తర్వాత వీరంతా స్థానిక పోలింగ్ కేంద్రం వద్ద జాతీయ గీతాన్ని ఆలపించాక ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందరూ ఓటేసిన 15 నిమిషాల తర్వాత ఫలితాలు ప్రకటించారు. 1960 నుంచి అర్ధరాత్రి ఓటు హక్కు వినియోగించుకునే సంప్రదాయం ఇక్కడ కొనసాగుతోంది.దీంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో దేశంలోనే తొలి ఫలితం ఇచ్చే ప్రదేశంగా డిక్స్‌విల్లే నాచ్ పేరుగాంచింది.అయితే, అమెరికా వ్యాప్తంగా అధ్యక్ష ఎన్నికలు మంగళవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) ప్రారంభంకానుండగా ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ సమయాలు వేర్వేరుగా ఉన్నాయి. అమెరికాలో వివిధ కాలమానాల ప్రకారం కొన్ని రాష్ట్రాల్లో ఉదయం ఆరు గంటలకు, మరికొన్ని రాష్ట్రాల్లో ఏడు, ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. న్యూహ్యాంప్‌షైర్ రాష్ట్రంలో ఉదయం ఆరు గంటలకు పోలింగ్ ప్రారంభం కానుండగా.. డిక్స్‌విల్లే నాచ్ ప్రాంతంలో మాత్రం అతి తక్కువ ఓట్లు ఉండటంతో నవంబర్ 5వ తేదీలోకి అడుగుపెట్టిన కొన్ని గంటలకే (అర్ధరాత్రే) పోలింగ్ నిర్వహించి.. కౌంటింగ్ కూడా పూర్తి చేశారు. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపడతారు. తుది ఫలితాలు వచ్చేందుకు కొన్ని రోజుల సమయం పట్టే అవకాశం ఉంది.

# గచ్చిబౌలిలో ఇంటి ముందు పార్కు చేసి ఉంచిన రెండు బైకుల చోరీ

హైదరాబాద్, ప్రజా భూమి ప్రతినిధి): గచ్చిబౌలిలోని ఓ కాలనీలో ఇంటి ముందు పార్కు చేసి ఉంచిన రెండు బైకులను దుండగులు చోరీ చేసిన సంఘటన సంచలనం సృష్టించింది. తాపీగా నడుచుకుంటూ వచ్చిన నిందితులు రెండు వాహనాలను తీసుకొని ఉండాయించిన దృష్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో ఈ విషయం వైరల్ గా మారింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం గచ్చిబౌలి పరిధిలోని సుదర్శన్ నగర్ కాలనీలో ఉంటున్న ఉదయ్ సాయిరెడ్డి, రమాకాంత్ లు సోమవారం రాత్రి తమ బైకులను వారు ఉంటున్న ఇంటి ముందు పార్కు చేశారు. కాగా మంగళవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో తలకు హెల్మెట్ పెట్టుకొని ఓ వ్యక్తి, ముఖానికి ముసుగు ధరించిన మరో వ్యక్తి నడుచుకుంటూ బైకులు పార్కు చేసిన ప్రదేశానికి వచ్చారు. వాహనాల తాళాలను బ్రేక్ చేసి ఓ రాయల్ ఎన్ ఫీల్డ్ బుల్లెట్, యమహా వాహనాలతో అక్కడి నుంచి ఉడాయించారు. నిందితులు బైకులను చోరీ చేసిన దృశ్యాలు స్థానికంగా ఉన్న సిసి కెమెరాల్లో రికార్డయ్యాయి. మంగళవారం ఉదయం బైకులు కనిపించకపోవడంతో సిసి కెమెరాలను పరిశీలించిన బాధితులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా నిందితులు హెల్మెట్, ముసుగు ధరించి ఉండడంతో గుర్తించకలేకపోయామని పోలీసులు తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు సుదర్శన్ నగర్ కాలనీతో పాటు ప్రధాన రహదారి మీద ఉన్న సిసి కెమెరాలను పరిశీలిస్తున్నట్లు గచ్చిబౌలి డిఐ రాజేష్ తెలిపారు.

# హైదరాబాద్ నలువైపులా మెట్రో విస్తరణ

### హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్వీఎస్.రెడ్డి

### 76.4 కిలోమీటర్లు, 5 కొత్త లైన్లతో మెట్రో రెండో ఫేజ్...

### హైదరాబాద్ మెట్రోలో గూగుల్ వ్యాలెట్, ఆర్సీఎస్ టికెటింగ్ ప్రారంభం




హైదరాబాద్, ప్రజా భూమి ప్రతినిధి): హైదరాబాద్ నలువైపులా మెట్రో సేవలను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నామని, మెట్రో విస్తరణ, రెండవ ఫేజ్ మీద ఇప్పటికే క్యాబినేట్ ఆమోదం తీసుకున్నామని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్.రెడ్డి అన్నారు. 76.4 కిలోమీటర్ల పొడవు.. 5 కొత్త లైన్లలో రెండవ ఫేజ్ మెట్రో అందుబాటు లోకి తీసుకువస్తామని అన్నారు. హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత సుఖవంతమైన టికెటింగ్ సదుపా యం కోసం గూగుల్ వ్యాలెట్, ఆర్సీఎస్ టికెటింగ్ విధానా న్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈమేరకు గచ్చిబౌలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ విధానాన్ని లాంఛన ంగా ప్రారంభించారు. ఆర్సీఎస్‌లో సాధారణ మెసేజ్ రూపంలో మొబైల్ ఫోన్ ద్వారా టికెట్ తీసుకునే సదుపా యాన్ని కల్పించడంతో పాటు గూగుల్ వ్యాలెట్‌లో మెట్రో లో ఏ ప్రాంతం నుంచి ఏ ప్రాంతానికైనా సులభంగా ప్రయాణించే విధంగా ఈ సదుపాయాలను అందుబాటు లోకి తీసుకువచ్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్వీఎస్.రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే మొదటిసారిగా హైదరాబాద్ మెట్రో రైలులో ఈ తరహా డిజిటల్ వ్యాలెట్ ను ప్రారంభించడం జరిగిం దని అన్నారు. ఫిజికల్ వ్యాలెట్ అవసరం లేకుండా హైద రాబాద్ మెట్రోలో ఎక్కడైనా ప్రయాణించవచ్చని, టిక్కెట్ తీసుకునే అవసరం లేకుండా గూగుల్ వ్యాలెట్, ఆర్సీఎస్ తో మొబైల్ ఫోన్‌లో బుకింగ్ చేసుకొని ప్రయాణం చేయవ చ్చని తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రారంభించే సమయంలోనే డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఆలోచించినట్లు తెలిపారు. డిజిటల్ టెక్నాలజీని అందిపు చ్చుకోవడంలో భారతీయులు నేడు ఎంతో ముందుంటున్నా రని అన్నారు. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ సర్టిఫికేట్ విషయంలో, ఆధార్ డిజిటలైజేషన్ విషయంలో భారతీయు ల సత్తాను ప్రపంచానికి చూపించామని అన్నారు. ఇండి యా స్టాక్‌ను ప్రపంచం మొత్తం నేడు అనుకరించేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. త్వరలోనే అమెరికా, చైనాలను మనదేశం మించిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో హైద రాబాద్ మెట్రో రైల్ ఎల్లప్పుడు ముందుంటుందని, రానున్న రోజుల్లో మరిన్ని విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రారంభించినప్పుడు 69కిలోమీటర్లతో దేశంలో రెండవ స్థానంలో ఉన్నామని, కానీ నేడు 9వ స్థానానికి పడిపోయామని అన్నారు. మెట్రో విస్తరణ, రెండవ ఫేజ్ అందుబాటులోకి తీసుకువచ్చి దేశంలో హైదరాబాద్ మెట్రోను మరోసారి అగ్రస్థానంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. నగరం నలువైపులా మెట్రోను విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారని, రెండవ ఫేజ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. మియాపూర్ - ఎల్బీనగర్ కారి డార్‌ను మియాపూర్ నుంచి పటాన్ చెరు వరకు, ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు విస్తరిస్తున్నామని, నాగోల్ - రాయదుర్గం కారిడార్ ను కోకాపేట్ నియోపోలీస్ వరకు విస్తరిస్తున్నామని అన్నారు. ఎయిర్ పోర్టు మెట్రోను అన్ని ప్రాంతాలకు కలిపే విధంగా రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. మొదటి ఫేజ్‌లో మిగిలిపోయిన 5.5 కిలోమీటర్ల రహదారిని సైతం కలిపేందుకు పనులు చేపడుతామన్నారు. ఎంజిబిఎస్ నుంచి చాంద్రా యణగుట్ట వరకు విస్తరించడంతో పాటు చంద్రాయణగు ట్టను మంచి జంక్షన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.కొత్త హైకోర్టును కలుపుతూ శంషాబాద్ మెట్రో రెండవ ఫేజ్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని అన్నారు. మొత్తం 76.4 కిలోమీటర్లతో 5 కొత్తలైన్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం 24.269 కోట్ల రూపాయల ఖర్చవుతుందని అన్నారు. ఇప్పటికే డిపిఆర్, సీఎంపిని కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు ను చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 30శాతం, కేంద్ర ప్రభుత్వం 18శాతం. ఇతర ఏజెన్సీలు 48శాతం భాగస్వామ్యంతో చేపడుతున్నామని అన్నారు. మొదటి ఫేజ్‌లో 10శాతం వడ్డీతో నిధులు తీసుకోవడం కారణంగా నష్టాలు వచ్చాయని, రెండవ ఫేజ్‌లో 2శాతం వడ్డీతో నిధులు సమకూర్చుకుం టున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ నిధులకు సావరీన్ గ్యారెంటీ ఇస్తుందన్నారు. నాగపూర్ మెట్రోతో భాగస్వామ్యమై ఉన్నామని, త్వరలో కొత్త ట్రైన్‌లను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో రోజుకు 1100 ట్రిప్పులు నడుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు, గూగుల్, రూట్ మొబైల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గోపన్ పల్లి స్థల వివాదంలో గచ్చిబౌలి ఎస్ఐ

### సైబరాబాద్ కమీషనర్, మాదాపూర్ డిసిపిలకు పిర్యాదు చేసిన బాధితుడు

### సెక్టార్ విధుల నుంచి తప్పించి విచారణ చేపట్టిన అధికారులు..



హైదరాబాద్, ప్రజా భూమి ప్రతినిధి): రియల్ వ్యాపారులు ఆక్రమించిన ప్లాటును తనకు విక్రయించేందుకు ప్రయ త్నించడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారం టూ గచ్చిబౌలి సబ్ ఇనిస్పెక్టర్ మీద ఓ బాధితుడు సైబరాబాద్ కమీషనర్, మాదాపూర్ డిసిపిలకు పిర్యాదు చేయడం సంచలనంగా మారింది. ఎస్ఐ వ్యవహారశైలి పై ప్రశ్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని బెదిరి స్తున్నాడంటూ బాధితుడు సైబరాబాద్ కమీషనర్ అవినా ష్ మహంతి, మాదాపూర్ డిసిపి వినీత్ లకు పిర్యాదు చేశాడు. బాధితుడి పిర్యాదుపై స్పందించిన పోలీసు బాస్ లు సదరు ఎస్ఐని సెక్టార్ విధుల నుంచి తప్పించి సివిల్ వివాదాల్లో తలదూర్చిన ఎస్ఐ మీద అంతర్గత విచారణ చేపట్టినట్టు సమాచారం. ఐటి కారిడార్ పరిధి లోని గోపన్ పల్లిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు బాదితుడి పిర్యాదు ప్రకారం...

శేరిలింగంపల్లి మండలం గోపన్ పల్లి సర్వే నెంబరు 124రూలో గల సోఫా కాలనీలో ప్లాటు నెంబరు 25లో 200 గజాల స్థలాన్ని సోఫా కాలనీకే చెందిన మహ్మద్ నవాజ్ కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చాడు. సదరు స్థలం నానక్ రాంగూడకు చెందిన షేక్ మునావర్ పాషా, ఓల్డ్ హాఫీజ్ పేట్‌కు చెందిన మహ్మద్ సుమీర్ ల పేరుమీద ఉన్నట్లు గుర్తించి ప్లాటు కొనుగోలు కోసం సెప్టెంబరు 16న 5లక్షల రూపాయలు అడ్వాన్సుగా చెల్లించి అగ్రిమెంటు చేసుకున్నాడు. ప్లాటుకు సంబంధించిన మొత్తం డబ్బు 25 రోజుల వ్యవధిలో చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. కాగా ప్లాటు యజమానుల ఆదేశాల ప్రకారం అడ్వాన్సు డబ్బును గచ్చిబౌలి సబ్ఇనిస్పెక్టర్ మహేందర్ రెడ్డి సమక్షంలో అందజేసినట్లు నవాజ్ తన పిర్యాదులో తెలిపాడు. డబ్బు సమకూర్చడంలో జాప్యంతో పాటు ప్లాటు విషయంలో తెలిసిన వాస్తవాలతో గడువు వ్యవధిలో తాను డబ్బు చెల్లించలేదన్నాడు. దీంతో అక్టోబరు 17వ తేదీన తన ఇంటికి వచ్చిన ఎస్ఐ మహేందర్ రెడ్డి మిగిలిన డబ్బుల కోసం అడిగాడని, తనకు మరికొంత సమయం కావాలని కోరాగా, మునావర్ పాషా. సుమీర్ లతో కలిసి ఎస్ఐ మహేందర్ రెడ్డి సదరు ప్లాటును మరొకరికి విక్రయించారన్నారు. విషయం తెలిసి ఎస్ఐని నిలదీయగా, ప్లాటు వేరొకరికి విక్రయించామని, రాద్దాంతం చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తానని బెదిరించాడని బాధితుడు వాపోయాడు. కాగా ప్లాటు నెంబరు 25 వాస్తవంగా షేక్ షుక్రూ అనే వ్యక్తికి చెందినదని, గత 13 సంవత్సరాలుగా షుక్రూ పోజిషన్‌లో ఉండి, విద్యుత్ మీటరు, వాటర్ కనెక్షన్ కలిగి ఉన్నాడని తన దృష్టికి వచ్చిం దన్నాడు. ఎస్ఐ మహేందర్ రెడ్డి, మునావర్, సుమీర్‌లు కలిసి నకిలీ డాక్యుమెంటుతో షుక్రూను భయపెట్టి, ప్లాటును కబ్జా చేసి తనకు విక్రయి ంచేందుకు ప్రయత్నించడంతోనే తాను కొనుగోలు విషయంలో వెనుకడుగు వేశానని బాధితుడు పిర్యా దులో తెలిపాడు. తన వద్ద అడ్వాన్సుగా తీసుకున్న 5లక్షల రూపాయలు తిరిగి ఇవ్వకపోగా, క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని తన మీద బెదిరింపులకు పాల్పడుతున్నాడని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు నవాజ్ సైబరాబాద్ కమీషనర్, డిసిపిలకు పిర్యాదు చేశాడు.

కాగా ఈవిషయమై గచ్చిబౌలి ఇనిస్పెక్టర్ హాబీబుల్లాఖాన్‌ను వివరణ కోరగా, బాదితుడు నవాజ్ పిర్యాదు చేశాడని, పిర్యాదుపై విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాగా గోపన్ పల్లి స్థల వివాదంలో తలదూర్చిన ఎస్ఐని సదరు సెక్టార్ విధుల నుంచి తప్పించగా, సెలవుపై వెళ్లినట్లు తెలుస్తుంది. మరోవైపు ఎస్ఐ వ్యవహారశైలిపై అంతర్గత విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ సమగ్ర కులగణన

### తెలంగాణ పిఏసి చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ

### బోయిన్ పల్లి సమావేశానికి భారీ కాన్వాయ్ తో వెళ్లిన ఎమ్మెల్యే గాంధీ



హైదరాబాద్, ప్రజా భూమి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుల గణన దేశానికే ఆదర్శంగా నిలువబోతుందని తెలంగాణ పిఏసి చైర్మన్ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ అన్నారు నగరంలోని బోయిన్ పల్లిలో జరిగిన సమగ్ర కులగనన సమీక్ష సమావేశానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ భారీ కాన్వాయ్ తో తరలి వెళ్లారు అంతకుముందు వివేకానంద నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నియోజకవర్గ శ్రేణులతో ఎమ్మెల్యే గాంధీ సమావేశం అయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రారంభించనున్న సమగ్ర కులగణనపై ప్రజలు, మేధావులు, పౌర హక్కులు, విద్యార్థి, కుల సంఘాల నేతలు, వివిధ సామాజిక వర్గాల వారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి బోయిన్ పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశానికి వస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికేందుకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలతో కలిసి బయలు దేరి వెళ్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుల గణన చేపట్టడం చాలా గొప్ప విషయం అని, ఎన్నో ఏండ్ల కళ నేటితో నెరవేరుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టడం హర్షించదగ్గ విషయం అని, ఈ విషయమై సాహసోపేత నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో సమగ్ర కులగణనను విజయవంతం చేయాలని, ప్రజలందరూ అధికారులకు సహకరించి వివరాలు అందజేయాలని అన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే జనాభా వారిగా లెక్కలు ఉండాలసిన అవసరం ఉందని, తద్వారా అసలైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించే వీలు ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ. 34కే బియ్యం.. మళ్ళీ భారత్ బ్రాండ్ సేల్స్



**అధిక ధరల నుండి వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు.. కేంద్ర ప్రభుత్వం మంగళవారం రెండవ దశ భారత్ బ్రాండ్ కింద సబ్సిడీ ధరలకు గోధుమ పిండి, బియ్యం విక్రయాలను ప్రారంభించింది. ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్, కేంద్రీయ భండార్, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విక్రయాలు జరగనున్నాయి.**

భారత్ బ్రాండ్ కింద కేజీ గోధుమ పిండి ధర రూ. 30 కాగా.. బియ్యం రూ. 34వద్ద అందుబాటులో ఉన్నాయి. గతంలో గోధుమ పిండిని రూ. 27.5కు, బియ్యాన్ని రూ. 29కే విక్రయించారు. అయితే ఇప్పుడు ఈ ధరలు కొంత పెరిగాయి. అయితే ప్రభుత్వం లక్ష్యం వ్యాపారం కాదని, మార్కెట్ ధరల కంటే తక్కువకు అందించడమే అని, ఫేజ్-2 ప్రారంభించిన సమయంలో కేంద్ర మంత్రి 'ప్రహ్లాద్ జోషి' తెలిపారు. గోధుమ పిండి, బియ్యం రెండూ కూడా 5 కేజీలు, 10 కేజీల ప్యాకెట్ల రూపంలో లభిస్తాయి. తక్కువ ధరకే గోధుమ పిండి, బియ్యాన్ని సరఫరా చేయడానికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) నుంచి 3.69 లక్షల టన్నుల గోధుమ, 2.91 లక్షల బియ్యాన్ని సేకరించినట్లు ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఈ స్టాక్ ఉన్నంత వరకు విక్రయాలు జరుగుతాయి, అవసరమైతే ఇంకా ఎక్కువ కేటాయిస్తామని పేర్కొన్నారు.

ప్రజలు కోరుకుంటే గోధుమ పిండి, బియ్యాన్ని మరింత చిన్న ప్యాకెట్ల రూపంలో కూడా అందించడానికి సిద్ధమని ప్రహ్లాద్ జోషి అన్నారు. మునుపటి దశలో కేంద్రం.. 15.20 లక్షల టన్నుల గోధుమ పిండిని, 14.58 లక్షల టన్నుల బియ్యం (అక్టోబర్ 2023 నుంచి జూన్ 30, 2024 వరకు) పంపిణీ చేసినట్లు సమాచారం.



# ఎన్‌ఫీల్డ్ 650 సీసీ బైక్

**రాయల్ ఎన్‌ఫీల్డ్ బేర్ 650ని మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ధర, ఫీచర్లు, బుకింగ్ విషయాలు మీ కోసం.. ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ మరో బైక్‌ను భారత మార్కెట్లోకి లాంచ్ చేసింది. బైక్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బేర్ 650 ను తాజాగా మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ధరను రూ.3.39 లక్షల (ఎక్స్ షోరూమ్, చెన్నై) నుంచి ప్రారంభమవుతుంది. ఈ నెలలోనే డెలివరీలు ప్రారంభం కానున్నాయి.**

రాయల్ బేర్ 650లో ముందువైపు 19 అంగుళాల స్పోక్డ్ వీల్స్, వెనకవైపు 17 అంగుళాల వీల్స్‌తో రానుంది. ఇందులో ట్యూబ్‌లెస్ టైర్లు ఇవ్వలేదు. ముందువైపు 320ఎంఎం డిస్క్, వెనవైపు 270ఎంఎం డిస్క్ బ్రేకులు ఇచ్చారు. ఈ బైక్ బరువు 216 కిలోలు. ఇంటర్‌సెప్టర్ 650 కంటే రెండు కిలోల తక్కువ బరువుతో వస్తోంది. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్, ఎల్ఈడీ లైటింగ్, టీఎఫ్‌టీ డిస్‌ప్లే, టైప్- సి ఛార్జింగ్ పోర్ట్ వంటి సదుపాయాలతో వస్తోంది.

ఇంటర్‌సెప్టర్ 650 తరహాలోనే ఇందులోనూ 648సీసీ ప్యారలల్ ట్విన్ ఎయిర్, ఆయిల్ కూల్డ్ ఇంజిన్ అమర్చారు. ఇది 7,150 ఆర్‌పీఎం వద్ద 47 హెచ్‌పీ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. 5,150 ఆర్‌పీఎం వద్ద గరిష్ఠంగా 56.6 పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6 స్పీడ్ గేర్ బాక్స్ ఉంది. వైల్డ్ హనీ, పెట్రోల్ గ్రీన్, గోల్డెన్ షాడో, బ్రాడ్‌వాక్ వైట్, టూ ఫోర్ నైన్ రంగుల్లో లభిస్తుంది. నవంబర్ 10 నుంచి బుకింగ్స్, టెస్ట్ రైడ్లు ప్రారంభం కానున్నాయి. నవంబర్ నెలాఖరు నుంచి డెలివరీలు మొదలవుతాయని కంపెనీ తెలిపింది.

# గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియ షురూ..

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు విలీనం కానున్నాయి. ఏపీ, తెలంగాణలోని గ్రామీణ బ్యాంకులూ ఏకీకృతం కానున్నాయి. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు లను మరింత సమర్థంగా నిర్వహించడం, ఖర్చులను నియంత్రణ కోసం ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను కేంద్రం విలీనం చేయాలని చూస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా ఈ ప్రక్రియ జరగ్గా.. నాలుగో దఫా ఏకీకృత ప్రక్రియను చేపట్టేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు మొదలు పెట్టింది. దీంతో ప్రస్తుతం ఉన్న గ్రామీణ బ్యాంకుల సంఖ్య 43 నుంచి 28కి తగ్గనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన రోడ్ మ్యాప్ సిద్ధమైంది. విలీన ప్రక్రియలో భాగంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న 15 ఆర్ఆర్‌బీలు విలీనం కానున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి




4, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన 3, బిహార్, గుజరాత్, జమ్మూకశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్‌లో రెండేసి ఆర్ఆర్‌బీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ విలీన ప్రక్రియ అప్పులు, ఆస్తుల సర్దుబాటుకు లోబడి జరుగుతుంది. ఒకే రాష్ట్రం- ఒకే ఆర్ఆర్‌బీ వల్ల ఆయా బ్యాంకుల పనితీరు మెరుగవుతుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన అధికారి ఒకరు తెలిపారు.

ప్రస్తుతం నాబార్డ్‌తో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారులకు రుణాలివ్వడానికి ఆర్ఆర్‌బీ చట్టం, 1976 కింద ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఏర్పడ్డాయి. వీటి యాజమాన్య నిర్మాణం ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుతం 50% వాటా ఉంది. మిగిలిన 50 శాతంలో ప్రాయోజిత బ్యాంకుకు (స్పాన్సర్) 35%, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి 15% వాటాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) 5 గ్రామీణ బ్యాంకులున్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు.. చిత్తూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

# వైదొలగిన మురళీకృష్ణన్



షావోమి ఇండియా విభాగ సారథ్య బాధ్యతల నుంచి మురళీకృష్ణన్ వైదొలగారు. ఈ విషయాన్ని షావోమీ మంగళవారం ధ్రువీకరించింది. వ్యక్తిగత కారణాల రీత్యా ఆయన పదవి నుంచి వైదొలిగినట్లు స్పష్టం చేసింది. అయితే ఈ ఏడాది చివరి వరకు ఆయన సంస్థలోనే కొనసాగనున్నట్లు తెలుస్తోంది. మురళీకృష్ణన్ 2018లో షావోమీలో అడుగుపెట్టారు. అంచలంచెలుగా ఎదిగి 2022 నాటికి ఆయన ఇండియా విభాగ సారథిగా మారారు. కంపెనీ అభివృద్ధి పథకంలో నడిపించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. మోటారోలా, లెనొవా మాజీ మేనేజర్ డైరెక్టర్ సుధిన్ మథుర్‌ను ఈ ఏడాది సెప్టెంబర్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా షావోమీ నియమించింది. ఈ నియామకం జరిగి కొన్ని రోజులకే మురళీకృష్ణన్ రాజీనామా చేయడం గమనార్హం. "షావోమీ ఇండియాలో నా అనుభవం అత్యంత ముఖ్యమైనది. నా ప్రయాణంలో సాధించిన విజయాల పట్ల చాలా గర్వంగా ఉంది. షావోమీలో బాధ్యతలు నిర్వహించే సమయంలో నాకు సహకరించిన టీమ్ సభ్యులకు, భాగస్వాములకు కృతజ్ఞతలు" అని మురళీకృష్ణన్ అన్నారు.

# రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి తొలి ఎలక్ట్రిక్ బైక్!

**రాయల్ ఎన్‌ఫీల్డ్ విద్యుత్ బైక్‌ల విభాగంలోకి ఎంట్రీ ఇచ్చింది. తాజాగా ఫ్లయింగ్ ఫ్లీ సీ6 పేరిట విద్యుత్ బైక్‌ను ఆవిష్కరించింది.**

దేశీయంగా విద్యుత్ ద్విచక్ర వాహనాలకు ఆదరణ పెరుగుతోంది. ఏటా విక్రయాలు జోరందుకుంటున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు ఈ విభాగంలో బైక్‌లను లాంచ్ చేశాయి. తాజాగా ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా ఈవీ రంగంలోకి అడుగుపెట్టింది. బైక్ ప్రియులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఎలక్ట్రిక్ బైక్‌ను తాజాగా ఆవిష్కరించింది. ఫ్లయింగ్ ఫ్లీ సీ6 పేరిట తీసుకొచ్చింది. ఫ్లయింగ్ ఫ్లీ సీ6 అనేది రెట్రో- ఫ్యూచరిస్టిక్ మోటార్ సైకిల్. ఇది రౌండ్ ఎల్ఈడీ హెడ్‌లైట్, ముందువైపు గిర్డర్ ఫోర్క్‌లతో రానుంది. ఇందులో ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్‌తో రానున్నట్లు తెలుస్తోంది. ఈ విద్యుత్ బైక్‌లో రెండు సీట్ల వెర్షన్లు కూడా ఉండనున్నట్లు అంచనా. ఇక టీఎఫ్‌టీ డిస్‌ప్లేతో రానుంది. సింగిల్ ఛార్జింగ్‌తో 100-150 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇకపై మార్కెట్లోకి తీసుకొచ్చే అన్ని విద్యుత్ బైక్‌లను 'ఫ్లయింగ్ ఫ్లీ' పేరిట ఆవిష్కరించనున్నట్లు రాయల్‌ఎన్‌ఫీల్డ్ ప్రకటించింది. లుక్‌ని రివీల్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ పూర్తి ఫీచర్ల వివరాలు, ధర ఇంకా వెల్లడించలేదు. త్వరలోనే ఆ వివరాలన్నీ ప్రకటించే అవకాశం ఉంది. 2026లో మార్కెట్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలుమొదలుపెట్టింది.





# ఇప్పటికీ ప్రజల దగ్గరే రూ.6970 కోట్ల విలువైన రూ.2 వేల నోట్లు

గతేడాది మే 19వ తేదీన ఆర్బీఐ రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. అప్పటికి చెలామణిలో ఉన్న రూ.2 వేల నోట్ల విలువ ఏకంగా రూ. 3.56 లక్షల కోట్లు. ఆ ప్రకటన తర్వాత ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను ఎక్స్ఛేంజ్ చేసుకోవడం లేదా తమ ఖాతాల్లో జమ చేసుకోవడం వంటివి చేశారు.

నోట్ల రద్దు తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2 వేల నోట్లను (%=o% 2000 ) ముద్రించి చెలామణిలోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గతేడాది మే 19వ తేదీన ఆర్బీఐ రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. అప్పటికి చెలామణిలో ఉన్న రూ.2 వేల నోట్ల విలువ ఏకంగా రూ. 3.56 లక్షల కోట్లు. ఆ ప్రకటన తర్వాత ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను ఎక్స్ఛేంజ్ చేసుకోవడం లేదా తమ ఖాతాల్లో జమ చేసుకోవడం వంటివి చేశారు. అన్ని బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా రూ.2 వేల నోట్లను ఆర్బీఐ ఉపసంహరించుకుంది.

అన్ని బ్యాంకుల్లో ఈ నోట్లను ఎక్స్ఛేంజ్ చేసుకునేందుకు 2023, అక్టోబర్ 7 వరకు అవకాశం కల్పించింది. క్రమంగా రూ.2 వేల నోట్లను తిరిగి వెనక్కి రప్పించింది. నాటి నుంచి ఇప్పటి వరకూ 98.04 శాతం నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చాయని సోమవారం ఆర్బీఐ వెల్లడించింది. అంటే గత నెల 31 నాటికి దేశంలో ప్రజల వద్ద ఉన్న రూ.2000 నోట్ల విలువ రూ.6,970 కోట్లు. 2023 అక్టోబర్ ఏడో తేదీ వరకూ అన్ని బ్యాంకుల శాఖల వద్ద రూ.2000 నోట్ల డిపాజిట్లకు అనుమతించారు. 2023 అక్టోబర్ తొమ్మిదో తేదీ నుంచి దేశంలోని 19 ఆర్బీఐ కార్యాలయాల వద్ద మాత్రమే రూ.2000 నోట్ల మార్పిడికి అనుమతి ఉంది. 2016 నవంబరు నెలలో అప్పటికి చలామణీలో ఉన్న రూ. 500, రూ. 1000 నోట్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వా త రూ. 2 వేల విలువైన పెద్ద నోటును ప్రవేశపెట్టింది. గతేడాది ఆ రెండు వేల నోటును ఉపసంహరించుకుంది. రూ. 2 వేల ఉపసంహరించుకున్నప్పటికీ రద్దు మాత్రం చేయలేదు. అయితే వాటిని బయటి మార్కెట్లలోనూ, బ్యాంక్‌ల్లోనూ తీసుకోవడం లేదు. దీంతో త్వరలోనే మొత్తం రెండు వేల నోట్లు వెనక్కి వచ్చేస్తాయని ఆర్బీఐ భావిస్తోంది.

# 'గేమ్ ఛేంజర్'.. ఈవెంట్స్

**తాను నిర్మిస్తున్న 50వ సినిమా 'గేమ్ ఛేంజర్' ఈవెంట్స్ అప్‌డేట్స్ ఇచ్చారు నిర్మాత దిల్ రాజు. రామ్ చరణ్ హీరోగా శంకర్ రూపొందిస్తున్న సినిమా అది. రామ్ చరణ్ హీరోగా దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మూవీ 'గేమ్ ఛేంజర్' . వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న సినిమాని విడుదల చేయనున్నారు.**




ఈ నేపథ్యంలో ముందస్తు వేడుకలు ఎప్పుడు? ఎక్కడ? నిర్వహించాలనుకుంటున్నారో నిర్మాత దిల్ రాజు వెల్లడించారు. చెన్నైలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. ఈ నెల 9న లఖ్‌నవూలో టీజర్ లాంచ్ ఈవెంట్ , తర్వాత యూఎస్, చెన్నైలో వేడుకలు, 2025 జనవరి మొదటి వారంలో తెలుగు రాష్ట్రాల్లో ఈవెంట్‌కు ప్లాన్ చేస్తున్నట్టు తెలిపారు.

**21 ఏళ్ల ప్రయాణం.. 50వ చిత్రం: దిల్ రాజు**

"నా 21 ఏళ్ల సినీ ప్రయాణంలో 'గేమ్ ఛేంజర్' 50వ చిత్రం. 3 ఏళ్ల క్రితం శంకర్ ఈ సినిమా కాన్సెప్ట్ చెప్పారు. ఆసక్తి కలిగింది. నిర్మాత ఆదిత్య రామ్ నా స్నేహితుడు. ఆయన నాలుగు తెలుగు సినిమాలు ప్రొడ్యూస్ చేశారు. వ్యాపారం నిమిత్తం చెన్నైలో బిజీ అయ్యారు. 'గేమ్ ఛేంజర్'లో భాగం కావాలని అడగ్గానే ఆయన ఓకే అన్నారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్, ఆదిత్య రామ్ మూవీస్ సంస్థలు ఈ ఒక్క సినిమానే కాదు మరిన్ని చిత్రాలకు కలిసి పని చేస్తాయి" అని దిల్ రాజు తెలిపారు.



# 'థగ్ లైఫ్' పాట చిత్రీకరణలో త్రిష

**అందం, అభినయంతో దక్షిణాదిలో తానేంటో నిరూపించుకున్న కథానాయిక త్రిష. కథల ఎంపికలో జోరు చూపిస్తూ సినీ ప్రియులను ఆకట్టుకుంటున్న ఈ భామ.. మరో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే.**

అందం, అభినయంతో దక్షిణాదిలో తానేంటో నిరూపించుకున్న కథానాయిక త్రిష. కథల ఎంపికలో జోరు చూపిస్తూ సినీ ప్రియులను ఆకట్టుకుంటున్న ఈ భామ.. మరో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. కమల్ హాసన్ కథానాయకుడిగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న చిత్రం 'థగ్ లైఫ్'. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న చిత్రమిది. సముద్రపు దొంగల నేపథ్యంలో యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలో త్రిషతో ఓ పాట సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్లు ఇన్‌స్టా వేదికగా తెలిపింది చిత్రబృందం. ఇందులో శింబు, జోజు జార్జ్, నాజర్, గౌతమ్ కార్తిక్, పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలో సినీ ప్రియుల ముందుకు రానుంది.

# చైతన్య, సాయిపల్లవికి ఇద్దరికీ అవార్డులొస్తాయి!

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన 'తండేల్' మూవీ విడుదల తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 7న ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. 'తండేల్'లో నటకుగానూ నాగచైతన్య , సాయిపల్లవి ఇద్దరికీ అవార్డులు వస్తాయని నిర్మాత అల్లు అరవింద్ ఆశాభావం వ్యక్తం చేశారు. చందూ మొండేటి దర్శకత్వంతో రూపొందిన చిత్రమిది. బన్నివాసు నిర్మాత. అల్లు అరవింద్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. చిత్రీకరణ చివరి దశకు వచ్చిన ఈ మూవీని ఫిబ్రవరి 7న విడుదల చేయనున్నట్లు చిత్రం బృందం ప్రకటించింది. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.




సంక్రాంతి నుంచి ఫిబ్రవరికి వాయిదా వేయడానికి కారణం?

అల్లు అరవింద్: సంక్రాతికి రావాలని అందరూ అనుకుంటారు. తాజాగా జరుగుతోన్న పరిణామాలను బట్టి ఈ నిర్ణయం తీసుకున్నాం. రానున్న సంక్రాంతికి నాలుగు పెద్ద సినిమాలున్నాయి. వాటికి థియేటర్లు షేర్ అవుతాయి. మాకు ఏ పోటీ లేకుండా రావాలని ఉంది. అందుకే ఫిబ్రవరి 7న రిలీజ్ చేస్తున్నాం. మార్చి మొదటి వారంలో పరీక్షలు ఉన్నాయి. అందుకే ఫిబ్రవరి 28 చేయలేదు. 'పుష్ప'తో అల్లు అర్జున్‌కు నేషనల్ అవార్డు వచ్చింది.. తండేల్‌తో సాయి పల్లవికి కూడా ఇలాంటి అవార్డు వస్తుందా? అల్లు అరవింద్: ఈ సినిమా సాయి పల్లవికి, నాగచైతన్యకు నేషనల్ అవార్డు తీసుకురావాలని కోరుకుంటున్నా. అది జరిగే అవకాశం ఉంది.

ఈ మధ్య బాయ్‌కాట్ సాయిపల్లవి ట్రెండ్ అవుతోంది. రూ.100కోట్ల క్లబ్‌లో చేరుతుందనుకుంటున్నారా?

బన్నివాసు: రూ.100కోట్ల క్లబ్‌లో చేర్చడం కోసం మా ప్రయత్నం చేస్తున్నాం. అది నా విష్. నెరవేరాలని కోరుకుంటున్నాం. ఇందులో మంచి కంటెంట్ ఉంది.




# 'పుష్ప2: ది రూల్'.. సరిగ్గా నెల రోజులు..

'పుష్ప2: ది రూల్' ట్రైలర్ విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు 5న మూవీ విడుదల కానున్న నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. హైదరాబాద్: అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప2: ది రూల్' . రష్మిక కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ డిసెంబరు 5న పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది. సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం ఉండటంతో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులోభాగంగా మంగళవారం సరికొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో పుష్పరాజ్ (అల్లు అర్జున్), భన్వర్‌సింగ్ షెకావత్ (ఫహద్ ఫాజిల్) ఎదురెదురుగా నిలబడి ఉన్నారు. అంతేకాదు, త్వరలోనే ట్రైలర్‌ను కూడా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

మరోవైపు 'పుష్ప2' విడుదలకు నెల రోజులే ఉండటంతో ప్రచార కార్యక్రమాలను మమ్మురం చేసే పనిలో ఉంది. ఇందులోభాగంగా అమెరికాలోని థియేటర్స్‌లో వినూత్న ప్రచారానికి తెర తీసింది. పుష్ప బ్రాండ్ పాప్‌కార్న్ టబ్స్, శీతల పానీయాల క్యాన్స్ అమెరికాలోని అన్ని థియేటర్స్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. నవంబరు 13వ తేదీ నుంచి 'కంగువా' ప్రీమియర్స్‌తో ఇవి అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకూ ఏ భారతీయ చిత్రమూ ఇలాంటి ప్రత్యేక ప్రమోషన్ చేయలేదు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతున్నాయి.

**ట్రైలర్ అప్పుడేనా?**

'పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైరు' అంటూ వచ్చిన పుష్ప1' ట్రైలర్ అప్పట్లో ఎంత ట్రెండ్ అయిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అంతకుమించిన స్థాయిలో ట్రైలర్ కట్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో వారం, పది రోజుల్లోనే ట్రైలర్‌ను తీసుకొచ్చేలా కసరత్తులు చేస్తున్నారు. నవంబరు 15 లేదా 16వ తేదీన ట్రైలర్ విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ట్రైలర్‌ను నేరుగా విడుదల చేస్తారా? ఈవెంట్ పెడతారా? అన్న దానిపై స్పష్టత రావాల్సిఉంది. సినిమా విడుదలకు కనీసం రెండు వారాల ముందు ట్రైలర్ విడుదల చేస్తే, ప్రచారానికి మరింత ఊపు వస్తుంది. ట్రైలర్ మాత్రమే కాదు, ఆ వెంటనే ఐటమ్ సాంగ్ లిరికల్ వీడియోను కూడా విడుదల చేయాలని భావిస్తున్నారు. సుకుమార్-దేవిశ్రీ కాంబినేషన్‌లో ఐటమ్ సాంగ్‌లు ఎవర్‌గ్రీన్. 'పుష్ప'లోనూ 'ఊ అంటావా మావ' పాట ఓ ఊపు ఊపేసింది. ఇప్పుడు 'పుష్ప2' కోసం దానిని మించేలా ఐటమ్ సాంగ్‌ను సిద్ధం చేస్తున్నారు. కథానాయిక శ్రీలీల ఇందులో ఆడిపాడనున్నట్లు చిత్రవర్గాల టాక్. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న మూవీ కావడంతో అందుకు తగినట్లే వివిధ నగరాల్లో ప్రెస్‌మీట్‌లు, ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లు చేయాలని ప్లాన్ చేస్తున్నారు.



# పది వేల స్క్రీన్స్‌లో..

**సూర్య హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'కంగువా'. తాజాగా దీని విడుదలపై నిర్మాత ఆసక్తికర కామెంట్స్ చేశారు. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రానున్న చిత్రం 'కంగువా' . అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.**

తాజాగా దీని రిలీజ్ గురించి నిర్మాత ధనుంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీన్ని భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 10వేల స్క్రీన్స్‌లో దీన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 'ఈ చిత్రం విడుదల కోసం ఆడియన్స్‌తో పాటు మేము కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. దీన్ని 10వేల స్క్రీన్స్‌లో ప్రదర్శించనున్నాం. వీటిలో చాలా స్క్రీన్లు ఇప్పటికే కన్ఫామ్ అయ్యాయి. దక్షిణాదిలో 2500 కంటే ఎక్కువ స్క్రీన్‌లు, ఉత్తరాదిలో 3,500 స్క్రీన్లలో ప్రదర్శించనున్నామని చెప్పడానికి ఎంతో గర్వపడుతున్నాం. నవంబర్ 14న మొత్తం 10 వేల స్క్రీన్‌లలో భారీస్థాయిలో కంగువా ప్రేక్షకుల ముందుకురానుంది' అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ.1000 కోట్ల కలెక్షన్స్ చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు నిర్మాత ఇటీవల చెప్పారు. పార్ట్ 2, పార్ట్ 3 కథలు కూడా సిద్ధంగా ఉన్నాయని.. పార్ట్ 1 విజయం ఆధారంగా వాటిని తెరకెక్కించేలా ప్లాన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా సూర్యని మరో స్థాయికి తీసుకెళ్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు. యాక్షన్‌తోపాటు ఎమోషన్స్‌కు ఇందులో అధిక ప్రాధాన్యం ఉందన్నారు. ఇక ఈ చిత్రం త్రీడీలోనూ అలరించనున్న విషయం తెలిసిందే.

# ఆవేశం.. రైట్స్.. రవితేజ దగ్గర

**ఈ ఏడాది 'ఆవేశం'తో మంచి హిట్ అందుకున్నారు ఫహద్ ఫాజిల్. జీతూ మాధవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ కామెడీ ఫిల్మ్ బాక్సాఫీసు వద్ద సత్తా చాటింది.**



ఈ ఏడాది 'ఆవేశం'తో మంచి హిట్ అందుకున్నారు ఫహద్ ఫాజిల్. జీతూ మాధవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ కామెడీ ఫిల్మ్ బాక్సాఫీసు వద్ద సత్తా చాటింది. 'ఆవేశం' ఓ వైవిధ్యమైన కథ. ఓ ముగ్గురు కాలేజీ స్టూడెంట్లు, తమ సీనియర్లను కొట్టించడానికి లోకల్ గ్యాంగ్‌స్టర్ అయిన రంగా (ఫహద్ ఫాజిల్)ను ఆశ్రయిస్తారు. ఆ క్రమంలో రంగాకి, విద్యార్థులకి మంచి స్నేహం ఏర్పడుతుంది. అయితే ఓ దశ దాటిన తర్వాత రంగా క్యారెక్టర్ కారణంగా ముగ్గురు విద్యార్థులు చిక్కుల్లో పడతారు. తర్వాత ఏం జరిగిందనేది ఆసక్తికరంగా వుంటుంది. ముఖ్యంగా ఫహద్ ఫాజిల్ క్యారెక్టరైజేషన్ ఈ కథలో స్పెషల్ ఎట్రాక్షన్. తెలుగు ఆ క్యారెక్టర్ ఎవరు చేసినా విలక్షణమైన పాత్రగా నిలుస్తుందనడంలో ఎలాంటి డౌట్ లేదు. ఈ సినిమాని తెలుగులో రీమేక్ చేస్తారని గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే! మాస్ మహారాజా రవితేజ ఈ సినిమా రీమేక్ హక్కులు తీసుకున్నారని తాజా సమాచారం. రవితేజకి సొంత నిర్మాణ సంస్థలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తారని తెలుస్తోంది.

# 6.2 మిలియన్ డాలర్స్ సిరీస్-ఏ నిధుల సేకరణకు మారుత్ డ్రోన్స్ యత్నం

## ఉత్పత్తి.. తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు కృషి

హైదరాబాద్ కి చెందిన మారుత్ డ్రోన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రముఖ డ్రోన్ టెక్నాలజీ కంపెనీ లోక్ క్యాపిటల్ నుండి సిరీస్ ఏ నిధులలో %వి%6.2 మిలియన్లను సేకరించింది. డ్రోన్ టెక్నాలజీల ఆవిష్కరణలో మారుత్ డ్రోన్స్ ముందంజలో ఉంది. భారతదేశంలోని వివిధ రంగాలలో డ్రోన్ల వినియోగ స్వీకరణను ప్రోత్సహించడానికి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తోంది. మారుత్ డ్రోన్స్‌లో లోక్ క్యాపిటల్ యొక్కపెట్టుబడి వినూత్న సాంకేతికతతో కూడిన ఆహారం, వ్యవసాయ వ్యాపార నమూనాలకు మద్దతు ఇవ్వడానికి దాని నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. మారుత్ యొక్క చొరవ ప్రభావం వ్యక్తులకు మించి విస్తరించింది, దీని చురుకైన విధానం టైర్ 2, 3 నగరాల్లో ఉన్నతమైన ఆర్థిక కార్యకలాపాలకు అనువదిస్తుంది, అట్టడుగు స్థాయిలో గ్రామీణ వర్గాల కోసం వ్యవస్థాపకత, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇది ప్రోత్సహిస్తుంది.

న్యూఢిల్లీ , నవంబర్ 05 : వినియోగదారుని అవసరాలకు అనుగుణంగా అధునాతన వ్యవసాయ డ్రోన్‌ల అభివృద్ధి, గ్రామీణ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు తన ఛానెల్ పార్టనర్ నెట్‌వర్క్ సేవా కేంద్రాలను టైర్ 2-3 నగరాల్లోకి విస్తరించడానికి డ్రోన్ అగ్రికల్చర్ సర్వీస్ హబ్‌లను ఏర్పాటు చేస్తోంది. భాగస్వామ్య విధానంతో డ్రోన్-యాజ్-ఎ-సర్వీస్ అందించడానికి డ్రోన్ అగ్రికల్చర్ సర్వీస్ హబ్‌లను ఏర్పాటుతో సహా అనేక కీలక కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని మారుత్ డ్రోన్స్ యోచిస్తోంది. అన్ని విభాగాలలో నిపుణులను నియమించడం, డ్రోన్ వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, నైపుణ్యం కలిగిన నిపుణులకు శిక్షణ ఇవ్వడానికి 17 కొత్త డ్రోన్ అకాడమీలను ప్రారంభించడం , ప్రత్యక్ష విత్తనాలు మరియు పంట పర్యవేక్షణ వంటి అధునాతన అప్లికేషన్‌లను రూపొందించడానికి భారతదేశంలోని ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో పరిశోధన, అభివృద్ధి ప్రయత్నాలను మెరుగుపరచడయే కంపెనీ లక్ష్యం.

లోక్ క్యాపిటల్ యొక్క డైరెక్టర్ హరి కృష్ణన్ మాట్లాడుతూ, ఈ రూపాంతర పెట్టుబడి కోసం తన ఉత్సాహాన్ని వ్యక్తం చేస్తూ, "రైతులు మరియు విస్తృత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిష్కారాలను తీసుకురావడానికి మారుత్‌లోని బృందంతో భాగస్వామ్యం కావడానికి మేము సంతోషిస్తున్నామని అన్నారు. వ్యవసాయం కోసం డ్రోన్‌లు అనేవి పంటల ఆరోగ్యాన్ని కాపాడగల ఒక గొప్ప సాంకేతికత అని, అదే సమయంలో అవి నీటిని ఆదా చేయడం, నేల ఆరోగ్యాన్ని కాపాడడం, రసాయనాలకు గురికాకుండా చేయడం, రైతులకు దిగుబడిని పెంచడం మరియు గ్రామ స్థాయి పారిశ్రామికవేత్తలకు ఆదాయాన్ని అందించడం వంటి ఉపయోగాలను అందిస్తాయని అన్నారు.కంపెనీలో మా పెట్టుబడి మార్కెట్ విస్తరణ, కొత్త సాంకేతిక ఆవిష్కరణలు మరియు స్వదేశీ తయారీ ప్రయత్నాలకు మద్దతు ఇస్తుందని అన్నారు."

మారుత్ డ్రోన్స్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు ప్రేమ్ కుమార్ విస్లావత్ మాట్లాడుతూ, "ఈ నిధుల సమీకరణ మరియు ఒకే ఆలోచన కలిగిన పెట్టుబడిదారులను తీసుకురావడం పట్ల మేము సంతోషిస్తున్నామని అన్నారు. భారతీయ రైతులను శక్తివంతం చేయడానికి, అన్ని రంగాలలోని సంస్థల కోసం డ్రోన్ ఆధారిత సేవలను సమగ్రపరచడానికి అప్లికేషన్‌లను అభివృద్ధి చేయడానికి ఈ ముఖ్యమైన పెట్టుబడి మారుత్ డ్రోన్స్ యొక్క నిబద్ధతను బలపరుస్తుందని అన్నారు.ఈ తాజా మూలధనం మా బృందాన్ని నిర్మించడంలో పెట్టుబడులు పెట్టడానికి, మా తయారీ సామర్థ్యాన్ని సంవత్సరానికి 3000 డ్రోన్‌లకు పెంచడానికి మరియు వచ్చే ఐదేళ్లలో 1000 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని వేగంగా చేరుకోవడానికి వేగవంతమైన స్కేలింగ్‌ను కొనసాగించడానికి మార్కెటింగును అనుమతిస్తుందని అన్నారు."

ప్రేమ్ కుమార్ విస్లావత్, సూరజ్ పెద్ది మరియు సాయి కుమార్ చింతలచే 2019లో స్థాపించబడిన మారుత్ డ్రోన్స్ పాన్-ఇండియా ఉనికిని స్థాపించాలనే లక్ష్యంతో ఉంది. తద్వారా విభిన్న భౌగోళిక ప్రాంతాలలో వ్యవసాయాన్ని




ఆధునీకరించడంలో కంపెనీ కీలక పాత్ర పోషిస్తుంది. వ్యవసాయానికి ప్రాధాన్యత ఉన్నప్పటికీ, మారుత్ డ్రోన్స్ విపత్తు నిర్వహణ, నిఘా అప్లికేషన్లను కూడా అన్వేషిస్తూ సమగ్ర డ్రోన్ సాంకేతిక పరిజ్ఞాన ప్రదాతగాదాని పాత్రను బలోపేతం చేస్తుంది. రైతులకు ఉత్పాదకతను పెంచడానికి, ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడానికి దోహదం చేస్తూ మారుత్ టైర్ 2, 3 నగరాల కోసం గ్రామీణ ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు కట్టుబడి ఉంది.కంపెనీ 200 మంది టీమ్ సభ్యులకు పెరిగింది మరియు భారతదేశంలోని 14 రాష్ట్రాలలో 750 డ్రోన్‌లు మరియు 1000 మందికి పైగా డ్రోన్ పైలట్‌లను కలిగి ఉంది. భారతదేశపు మొట్టమొదటి డిజిసిఏ టైప్ సర్టిఫైడ్ మీడియం కేటగిరీ బహుళ ప్రయోజన వ్యవసాయ, చేపల దాణా పంపిణ డ్రోన్ అయినటువంటి మారుత్ యొక్క %గా+365ఎ%ను ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి , భారత పౌర విమానయాన మంత్రి ప్రారంభించారు. భారతీయ వ్యవసాయ పరిశ్రమలో విప్లవాన్ని సృష్టించే దాని ప్రయాణంలో చేరడానికి డ్రోన్ విక్రయాలు, డ్రోన్ సర్వీస్ మరియు డ్రోన్ శిక్షణ వంటి అన్ని వ్యాపార కార్యకలాపాల కోసం ఔత్సాహిక వ్యక్తులు, వ్యవసాయ పారిశ్రామికవేత్తలు, భారీ అగ్రి ఇన్‌పుట్ కంపెనీలు, వ్యవసాయ పరికరాల తయారీదారులు, అగ్రి రిటైలర్లు/ డీలర్లు/ పంపిణీదారుల నుండి భాగస్వామ్యాలను మారుత్ డ్రోన్స్ ఆహ్వానిస్తోంది.

# టాప్-10లోకి హర్మన్

### సెంచరీ చేసినా మంధనకు నిరాశే..!

ఐసీసీ తాజాగా విడుదల చేసిన మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ భారీగా లబ్ది పొందింది. గత వారం న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన హర్మన్.. మూడు స్థానాలు మెరుగు పర్చుకుని తొమ్మిదో స్థానానికి చేరింది. న్యూజిలాండ్ చివరి రెండు ఇన్నింగ్స్‌ల్లో హర్మన్ 83 ప రుగులు చేసింది. ఇందులో సిరీస్ డిసై డర్‌లో చేసిన ఓ హాఫ్ సెంచరీ కూడా ఉంది. .




సెంచరీ చేసినా మంధనకు నిరాశే..!

తాజా ర్యాంకింగ్స్‌లో టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధనకు ఎలాంటి లబ్ది చేకూరలేదు. న్యూజిలాండ్ సిరీస్‌లోని చివరి మ్యాచ్‌లో సెంచరీ చేసినా మంధన ర్యాంకింగ్స్‌లో ఎలాంటి మార్పు లేదు. అయితే ఆమె తన ర్యాంకింగ్ పాయింట్లను గణనీయంగా మెరుగుపర్చుకుంది. ఈ వారం ర్యాంకింగ్ పాయింట్స్‌లో మంధన 703 నుంచి 728 పాయింట్లకు ఎగబాకింది. ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న మంధనకు మూడో ప్లేస్‌లో ఉన్న చమారీ ఆటపట్టుకు కేవలం ఐదు పాయింట్ల డిఫరెన్స్ మాత్రమే ఉంది.ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్‌కు చెందిన నాట్ సీవర్ బ్రంట్ టాప్‌లో కొనసాగుతుండగా.. సౌతాఫ్రికాకు చెందిన లారా వోల్వార్ట్ రెండో స్థానంలో ఉంది. భారత ప్లేయర్లలో దీప్తి శర్మ 20వ స్థానంలో ఉండగా.. జెమీమా రోడ్రిగెజ్ 30వ స్థానంలో ఉంది.బౌలింగ్ విషయానికొస్తే.. న్యూజిలాండ్ సిరీస్‌లోని మూడు ఇన్నింగ్స్‌ల్లో ఆరు వికెట్లు తీసిన దీప్తి శర్మ రెండో స్థానంలో కొనసాగుతుంది. ఇంగ్లండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ టాప్‌లో తన హవా కొనసాగిస్తుంది. దీప్తికి సోఫీకి మధ్య 67 పాయింట్ల వ్యత్యాసం ఉంది. ఈ వారం ర్యాంకింగ్స్‌లో భారత పేసర్ రేణుక సింగ్ నాలుగు స్థానాలు మెరుగుపర్చుకుని 32వ స్థానానికి ఎగబాకగా.. మరో ఇద్దరు భారత బౌలర్లు ప్రియా మిశ్రా, సోయ్‌మా ఠాకోర్ టాప్-100లోకి ఎంటర్ అయ్యారు.

# కోహ్లీ బర్త్‌డే విరాట్

భారత దిగ్గజ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇవాళ (మంగళవారం) పుట్టిన రోజు జరుపుకుంటున్నాడు. 35 సంవత్సరాలు నిండి 36వ ఏడాదిలోకి అడుగుపెట్టడు. 15 ఏళ్లకు పైగా అద్భుతమైన కెరీర్ ఉన్న కోహ్లీకి పుట్టిన రోజు శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. తోటి క్రికెటర్ల నుంచి మాజీ దిగ్గజాలు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా తమ విషెస్ తెలియజేస్తున్నారు.




## ఎన్నేళ్లు నిండాయో తెలుసా

భారత దిగ్గజ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇవాళ (మంగళవారం) పుట్టిన రోజు జరుపుకుంటున్నాడు. 35 సంవత్సరాలు నిండి 36వ ఏడాదిలోకి అడుగుపెట్టాడు. 15 ఏళ్లకు పైగా అద్భుతమైన కెరీర్ ఉన్న కోహ్లీకి పుట్టిన రోజు శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. తోటి క్రికెటర్లు మొదలుకొని మాజీ దిగ్గజాలు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా తమ విషెస్ తెలియజేస్తున్నారు. బీసీసీఐ కూడా ఎక్స్ వేదికగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపింది.

" 538 అంతర్జాతీయ మ్యాచ్‌లు.. ఇంకా కౌంటింగ్. 27,134 అంతర్జాతీయ పరుగులు, ఇంకా కౌంటింగ్.. 2011 ఐసీసీ వరల్డ్ కప్ విజేత జట్టులో భాగస్వామి, 2013 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విజేత జట్టులో ప్లేయర్, 2024 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ విజేత జట్టులో ఆటగాడు. టీమిండియా మాజీ కెప్టెన్, అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడైన విరాట్ కోహ్లీకి పుట్టినరోజు శుభాకాంక్షలు" అని బీసీసీఐ గ్రాండ్‌గా బర్త్‌డే విషెస్ తెలిపింది. అద్భుతమైన క్రికెట్ కెరీర్‌తో ఒక దిగ్గజ క్రికెటర్ స్థాయికి ఎదిగిన విరాట్ కోహ్లీ పుట్టిన రోజు సందర్భంగా అతడి కెరీర్ గణాంకాలను ఒకసారి గమనిద్దాం..

ఆధునిక క్రికెట్‌కు విరాట్ కోహ్లీని ఒక బ్రాండ్ అంబాసీడర్‌గా అభివర్ణించవచ్చు. రన్-ఛేజింగ్‌లో మాస్టర్ అయిన విరాట్ ఎన్నో చిరస్మరణీయమైన ఇన్నింగ్స్ ఆడాడు. విరాట్ 2008లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. ఇప్పటివరకు 118 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 29 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. 47.83 సగటుతో మొత్తం 9,040 పరుగులు సాధించాడు. ఈ ఫార్మాట్‌లో అత్యుత్తమ స్కోరు 254 (నాటౌట్) ఉంది. టెస్టుల్లో భారత్ తరపున అత్యధిక పరుగులు, సెంచరీలు సాధించిన నాలుగవ ఆటగాడిగా విరాట్ కోహ్లీ నిలిచాడు.

ఇక వన్డే కెరియర్ విషయానికి విరాట్ గణాంకాలు ఔరా అనిపిస్తాయి. ఇప్పటివరకు 295 వన్డేలు ఆడిన విరాట్ 58.18 సగటుతో 13,906 పరుగులు బాదాడు. ఇందులో 50 సెంచరీలు, 72 అర్ధసెంచరీలు ఉన్నాయి. ఈ ఫార్మాట్‌లో విరాట్ బెస్ట్ స్కోరు 183 పరుగులుగా ఉంది. వన్డేలలో అత్యధిక పరుగులు చేసిన మూడవ ఆటగాడిగా, భారత క్రికెటర్లలో రెండవ ఆటగాడిగా కోహ్లీ కొనసాగుతున్నాడు. ఇక వన్డేల్లో 50 సెంచరీలు సాధించిన ఏకైక ఆటగాడు విరాట్ కావడం విశేషం. వన్డేల్లో అత్యంత వేగంగా 8,000 పరుగులు, 9,000 పరుగులు, 10,000 పరుగులు, 11,000 పరుగులు, 12,000 పరుగులు, 13,000 పరుగుల మైలురాయిలను అందుకున్న ఆటగాడిగానూ కొనసాగుతున్నాడు. వన్డేల్లో ఛేజ్ మాస్టర్‌గా పేరొందాడు.

ఇక టీ20 ఫార్మాట్ విషయానికి వస్తే.. విరాట్ ఇప్పటిరవకు 125 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 117 ఇన్నింగ్స్‌లలో బ్యాటింగ్ చేసి 48.69 సగటుతో మొత్తం 4,188 పరుగులు సాధించాడు. ఈ ఫార్మాట్‌లో విరాట్‌కు ఒక సెంచరీ, 38 అర్ధసెంచరీలు ఉన్నాయి. అత్యుత్తమ స్కోర్ 122 (నాటౌట్)గా ఉంది. ఈ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు సాధించిన రెండవ ఆటగాడు. విరాట్ కావడం విశేషం. ఈ ఫార్మాట్‌లో 7 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులను గెలుచుకున్నాడు. ఇక ఫ్రాంచైజీ లీగ్ ఐపీఎల్‌లో కూడా విరాట్‌కు అత్యద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది.




# ఆసీస్ సిరీస్‌తో ఎవరు ఉంటారో

న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ కోల్పోయింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో వెనకబడిపోయింది. అప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న టీమ్ఇండియా సిరీస్ ఓటమితో రెండుకు పడిపోయింది. ఈనెల మూడో వారం నుంచి ఆసీస్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను ఆడనుంది. ఇప్పటికే ఓటమి భారంతో ఉన్న భారత్‌కు మరో షాక్ ఇచ్చేందుకు ఆసీస్ అన్నివిధాలా సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ 4-0తో గెలవడం కష్టమేనని పేర్కొన్న సన్నీ.. తాజాగా సీనియర్ల భవితవ్యంపైనా స్పందించాడు. ఈ సిరీస్‌తో వారి భవిష్యత్తు తేలిపోతుందని వ్యాఖ్యానించాడు. "ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌ను గెలవడంపైనే దృష్టి సారించాలని గతంలోనే చెప్పా. అది ఎలా అనేది పక్కన పెట్టేయాలి. ఫస్ట్ సిరీస్ నెగ్గాలి. ఆ తర్వాతనే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌పై ఆలోచించాలని న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ఓటమి అనంతరం భారత్‌కు సూచించా. మొన్నటివరకు అత్యంత బలంగా ఉందనిపించిన టీమ్ఇండియాకు ఇప్పుడు కఠిన సవాల్ ఎదురుకానుంది. గత కొన్నేళ్లుగా అదరగొడుతూ వచ్చిన సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇటీవల తమ స్థాయి ప్రదర్శన చేయలేదు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాను ఓడించిన భారత్.. స్వదేశంలో కివీస్ చేతిలో పరాజయం చవిచూస్తుందని ఎవరూ ఊహించలేదు. ఈ సీనియర్లు కూడా భారీగా పరుగులు చేయడంలో విఫలమమ య్యారు. అందుకే, ఆసీస్‌తో టెస్టు సిరీస్ వీరి భవిష్యత్తును నిర్ణయిస్తుంది. స్వదేశంలో స్పిన్నర్లనే ఎదుర్కోవడంలో తెగ ఇబ్బందిపడ్డారు. అలాంటిది ఆస్ట్రేలియా గడ్డపై పేస్‌కు ఎదురొడ్డి నిలవాలంటే మాటలు కాదు. తమ సత్తాను నిరూపించుకొని కొనసాగుతారా? లేదా అనేది చూడాలి" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.?